

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్

JORDAR TELUGU DAILY ధి తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం



కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 304 ఆదివారం, నవంబర్ 22 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా..

రేషన్ కార్డు నంబరే అప్లికేషన్


హైదరాబాద్ :ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదుపై తెలంగాణ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రతి కుటుంబం నుంచి 18--59 ఏళ్ల మధ్య వయసున్న ఒక్కరికి మాత్రమే బీమా కల్పిస్తారు. బీమా పొందిన వ్యక్తి మరణిస్తే నామినీలకు రూ.5 లక్షలు అందుతాయి. రేషన్ కార్డు నంబరే దరఖాస్తు సంఖ్యగా ఉంటుంది. ఆధార్, రేషన్ కార్డు, ఓటీపీ ధ్రువీకరణ తప్పనిసరి. ఈ-కేవైసీ పూర్తిచేసుకున్న కుటుంబాలనే పథకంలో నమోదు చేస్తారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదుపై కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న జీవిత బీమా, ఇతర బీమా పథ కాలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఆయా పథకాల పరిధిలోకి రాని కుటుంబాలను



మాత్రమే కొత్త పథకంలో నమోదు చేయాలని ఆదేశించింది. ఈ పథకం కింద బీమా పొందిన వ్యక్తి మరణిస్తే వారి నామినీలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొం దిం చింది. శుక్రవారం విడుదల చేసిన తాజా మార్గదర్శకాల ప్రకా రం.. బీమా చేయించుకోవాలనుకునే వ్యక్తి స్వయంగా నమోదు శిబిరానికి హాజరై తన నామినీల వివరాలు అందించాలి. అనారోగ్యం లేదా దివ్యాంగత్వం కారణంగా శిబిరానికి రాలేని వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. శిబిరం ఇన్‌ఛార్జి వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి.ఈ పథకం కింద ప్రతి కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే బీమా సదుపాయం కల్పిస్తారు. కుటుంబ పెద్ద లేదా కుటుంబ పోషణకు ప్రధానంగా ఆదాయం సమకూర్చే వ్యక్తిని బీమా పరిధిలోకి తీసుకుంటారు. నమోదుకు నిర్ణయించిన వయో పరిమితి 18 నుంచి 59 ఏళ్లు.

'నేను సవాళ్లనే సవాల్ చేసే మనిషిని'..

ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినమ్ జూబ్లీ వేడుకల్లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: తాను సవాళ్లనే సవాల్ చేసే మనిషినని, అలా సవాల్ చేయడాన్ని తాను ఎన్నడూ ఆపలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలోనే తొలి ఐఐటీ అయిన పశ్చిమబెంగాల్ 'ఐఐటీ- ఖరగ్‌పుర్ ప్లాటినం జూబ్లీ వేడుకలకు ప్రధాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో ప్రసంగిస్తూ ఆయన పైవ్యాఖ్యలు చేశారు .ఒకప్పుడు స్వాతంత్ర్య సమరయోధుల నిర్బంధ శిబిరం ఉన్న ప్రాంతంలోనే ఐఐటీ ఖరగ్‌పుర్‌ను నిర్మించారు. 75 ఏళ్ల ప్రయాణంలో ఈ ఐఐటీ ఎన్నో మైలురాళ్లను చేరింది. దేశాభివృద్ధిలో, ఆవిష్కరణలలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలకపాత్ర పోషిస్తున్నదని ప్రధాని తెలిపారు. గత పన్నెండేళ్లలో ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరిచామని, పేద ప్రజలను శక్తిమంతం చేశామని చెప్పారు. పేదరిక నిర్మూలన అంశం గతంలో ఎర్రకోట పైనుంచి ప్రసంగాలు, దస్త్రాల రూపకల్పనకే పరిమితమైందని విమర్శించారు.తమ 12-13 ఏళ్ల పాలనలో దేశంలోని 50 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని ఇటీవల ప్రపంచ బ్యాంక్ నివేదిక ఇచ్చిన విషయాన్ని ప్రధాని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ ప్రజోపయోగ నిర్ణయాలవల్లే ఇది సాధ్యమైందన్నారు. తాను సెమీకండక్టర్ మిషన్ గురించి మాట్లాడినప్పుడు చాలామంది ఆలస్యమైందన్నారని చెప్పారు. కానీ ఇప్పుడు సెమీకండక్టర్ రంగంలో మనం ముందున్నామని అన్నారు.రాబోయే రెండు దశాబ్దాల కాలం విద్యార్థులకు, దేశానికీ ఎంతో కీలకమని ప్రధాని చెప్పారు.

పగలగొట్టింది అద్దాన్ని మాత్రమే

బ్రాండ్ హైదరాబాద్‌పై ఉన్న నమ్మకాన్ని' : కేటీఆర్

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని మెటా ఆఫీసు వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టిన ఘటనపై మాజీ మంత్రి కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ శ్రేణులు పగలగొట్టింది కేవలం అద్దాన్నే కాదని.. బ్రాండ్ హైదరాబాద్‌పై ఉన్న నమ్మకాన్ని అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎక్స్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని ట్యాగ్ చేసిన కేటీఆర్.. గూండాయిజంతో దేశానికి పరిశ్రమలు తీసుకురావాలని అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో ఇలాంటి సంస్థను ఒక్కటైనా తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు.హైదరాబాద్: ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను సస్పెండ్ చేశారనే ఆరోపణలతో నాలెడ్జ్ సిటీలోని మెటా ఆఫీసు వద్ద తెలంగాణ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగిన



సంగతి తెలిసిందే. మెటా ఆఫీసు వద్దకు వెళ్లిన యూత్ కాంగ్రెస్ శ్రేణులు.. నినాదాలు చేశారు. సస్పెండ్ చేసిన ఖాతాలపై ఆంక్షలను వారం రోజుల్లోగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు 21 మందిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విడుదల చేశారు. అయితే ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు మీడియాకు తెలిపారు.మెటా కార్యాలయం వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టిన ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో హైదరాబాద్‌కు మెటా లాంటి సంస్థను ఒక్కటైనా తీసుకొచ్చారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. దేశానికి పరిశ్రమలు తేవడానికి గుండాయిజమే మార్గం అని అనుకుంటున్నారా? అని రాహుల్ గాంధీని ఆయన ప్రశ్నించారు."బ్రాండ్ హైదరాబాద్ దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది కుటుంబాలకు తిండి పెడుతోంది. దశాబ్దాలపాటు ఎంతో శ్రమకు ఓర్చి, పరిశ్రమలకు అనుకూలమైన పాలసీలను తీసుకొచ్చి హైదరాబాద్ బ్రాండ్‌ను తీర్చిదిద్దారు. హైదరాబాద్‌లోని మెటా ఆఫీసును ధ్వంసం చేయడం గొప్ప విషయమని కాంగ్రెస్ గుండాలు అనుకుం టున్నారు. దీని గురించి గొప్పలు కూడా చెప్పుకుం టున్నారు. తెలంగాణలో మూడేళ్ల పాలనలో మెటా లాంటి ఒక్క పెద్ద బ్రాండ్‌నైనా హైదరాబాద్‌కు మార్గమా? హైదరాబాద్‌లోనే ఉంది

కనీసం సెక్రటరీనే లేదు.. నువ్వేం ఇండస్ట్రీలను ఆకర్షిస్తావ్..

రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్



హైదరాబాద్ :ఖైరతాబాద్‌లో మన పార్టీ మీద గెలిచి పార్టీ మారిన దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేసింది.. రేపో మాపో ఎన్నికలు రాబోతు న్నా యి.. ఈ సమయంలో ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ దుకాణం ఖాళీ అవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు.. ఇది బీఆర్ఎస్ గెలుపునకు ఒక గొప్ప సూచిక అని అన్నారు. సోమాజిగూడ డివిజన్ యువ నాయకుడు మహేశ్ యాదవ్ ఆధ్వర్యంలో త్రినాథ్‌తోపాటు పలువురు కార్యకర్తలు మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి హరీశ్ రావు గులాబీకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఈ మధ్య రాష్ట్రంలో ఎవరూ సర్వే చేయించినా.. రేవంత్ రెడ్డి చేయించుకున్నా.. ఏజెన్సీలు చేసినా.. ఏ పార్టీ సర్వే చేసినా అన్ని సర్వేల్లో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వస్తుందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్రంలోని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు.ఇండస్ట్రీలను ఆకర్షిస్తా.. నేను భారత్ సమ్మిట్‌ను పెడతా అంటుండు రేవంత్ రెడ్డి.. అసలు ఈ రాష్ట్రానికి రెండేళ్ల నుంచి పరిశ్రమల కార్యదర్శే లేడు. ఐటీ శాఖకు సెక్రటరీనే లేడు.. నీ బొంద నువ్వేం ఇండస్ట్రీలను ఆకర్షిస్తావ్.. ఇండస్ట్రీ డిపార్ట్‌మెంట్‌కు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండాలి.. ఐటీ డిపార్ట్‌మెంట్‌కు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండాలి.

తిరుమల శ్రీవారికి 121 కిలోల బంగారు ఆభరణాల కానుక!



అమరావతి, నవంబరు 21: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి ఓ భక్తుడు అపూర్వమైన కానుకను సమర్పిం చేం దుకు సిద్ధమయ్యారు. ఏడుకొండల వాడిపై ఎ అపారమైన భక్తిని చాటుకుంటూ ఏకంగా 121 కిలోల బంగారంతో తయారు చేయించిన ఆభరణాలను స్వామివారికి కానుకగా అందించనున్నారు. ఈ బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.150 కోట్ల నుంచి రూ.160 కోట్ల వరకు ఉంటుందని అంచనా. మొత్తం 9 సెట్లుగా రూపొందించిన 45 రకాల బంగారు ఆభరణాలను స్వామివారి సేవలో సమర్పించేందుకు భక్తుడు ఏర్పాట్లు పూర్తి చేశారు.
ఈ భారీ కానుక సమర్పణకు సంబంధించి ఇప్పటికే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులతో సదరు భక్తుడు సంప్రదింపులు పూర్తి చేసినట్లు సమాచారం. ఈ నెల 26వ తేదీన తిరుమలలోని శ్రీవారి సన్నిధిలో టీటీడీ అధికారులకు ఈ బంగారు ఆభరణాలను అధికారికంగా అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు, ప్రక్రియలపై టీటీడీతో చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. 121 కిలోల బంగారంతో తయారు చేసిన 45 ఆభరణాలు, 9 సెట్లుగా స్వామివారికి చేరనుండటంతో
కానుకకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది.


పారిశ్రామిక విప్లవం కంటే ఏఐ విప్లవమే పెద్దది.. ఆంధ్రోపిక్ ఐపీఓపై ట్రంప్ ప్రశంసలు..



అమెరికా:పారిశ్రామిక విప్లవం కంటే ఏఐ విప్లవమే పెద్దదని, ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేయబోతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ భారీ ఐపీఓతో స్టాక్ మార్కెట్లో రికార్డు సృష్టించడంపై ఆయన ప్రశంసలు కురిపించారు. ఆ సంస్థ సీఈఓ దారియో అమోడీపై తనకు ఎంతో గౌరవం ఉందని చెప్పారు. అలాగే అమెరికాలో ఏఐ డేటా సెంటర్ల నిర్మాణానికి అనుమతులు ఆలస్యం చేస్తే, కంపెనీలు ఇతర దేశాలకు వెళ్లిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు ఏఐ అనేది పారిశ్రామిక విప్లవం కంటే పెద్దదని, తాను కూడా ఆ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నానని వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ అన్నారు. ఆంథ్రోపిక్ ఐపీఓ రికార్డు సృష్టించిందని, ఏఐ రంగంలో అమెరికా అగ్రస్థానాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఏఐ రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని కొనసాగించాలంటే భారీ మౌలిక సదుపాయాలు అవసరమని ట్రంప్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఏఐ మోడళ్ల శిక్షణ, నిర్వహణ కోసం డేటా సెంటర్లు కీలకమని చెప్పారు.

పిల్లల గోప్యత మాటున అసలు ఆరోపణలకు సమాధానమెక్కడ?

- అవుట్‌రీచ్ వర్కర్‌పై ఫిర్యాదు.. నియామక అర్హతలు, బాల్య వివాహాలు, స్పాన్సర్‌షిప్ నిధులపై సమగ్ర విచారణకు డిమాండ్



(వరంగల్, జోర్దార్ నిఘా విభాగం): జిల్లాలో గతంలో విధులు నిర్వహించిన ఓ అవుట్‌రీచ్ వర్కర్‌పై వచ్చిన ఫిర్యాదు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సంబంధిత ఉద్యోగి నియామక అర్హతలు, రెసిడెన్స్ సర్టిఫికెట్, బాల్య వివాహాల కేసుల నిర్వహణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) వ్యవహారాలు, స్పాన్సర్‌షిప్ పథకం అమలుపై సమర్పించిన ఫిర్యాదుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఇచ్చిన సమాధానం పలు ప్రశ్నలకు తావిస్తోంది.
2022లో ఉద్యోగంలో చేరే సమయంలో సంబంధిత ఉద్యోగి సమర్పించిన శాయంపేట మండల రెసిడెన్స్ సర్టిఫికెట్‌ను, వాస్తవ నివాసానికి సంబంధించిన మొగుళ్లపల్లి మండల రికార్డులతో పోల్చి పరిశీలించారా? నియామక సమయంలో అర్హతలను పూర్తిస్థాయిలో ధ్రువీకరించారా? అనే అంశాలపై విచారణ జరపాలని ఫిర్యాదులో కోరారు.అలాగే 2020 నుంచి బాల్య వివాహాల కేసుల నిర్వహణలో సంబంధిత ఉద్యోగి విధులు సక్రమంగా నిర్వర్తించారా? కేసుల సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించారా? సీడబ్ల్యూసీ ప్రొసీడింగ్స్, ఉత్తర్వులు, పోలీస్ రికార్డుల మధ్య ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించాలని కోరారు.
2025 జూలై నుంచి స్పాన్సర్‌షిప్ పథకానికి సంబంధించిన దరఖాస్తులు, లబ్ధిదారుల ఎంపిక, నిధుల మంజూరు, చెల్లింపుల్లో నిబంధనలు పాటించారా? లబ్ధిదారుల కుటుంబాల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని ఫిర్యాదుదారుడు డిమాండ్ చేశారు.అయితే ఈ ఫిర్యాదుపై స్పందించిన శాఖ, బాలల వ్యక్తిగత వివరాలను వెల్లడించడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ జువెనైల్ జస్టిస్ చట్టంలోని 74, 99 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని 23వ సెక్షన్‌ను ప్రస్తావించింది. పిల్లలకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను అందించలేమని తెలిపింది.
దీనిపై ఫిర్యాదుదారుడు అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. తాము పిల్లల పేర్లు, చిరునామాలు లేదా వ్యక్తిగత వివరాలను కోరడం లేదని, గోప్యతకు భంగం కలగకుండా కేసుల సంఖ్య, ఉద్యోగుల విధుల నిర్వహణ, విచారణ పురోగతి, శాఖాపరమైన చర్యలు, స్పాన్సర్‌షిప్ నిధుల మొత్తం వంటి పరిపాలనా వివరాలను వెల్లడించవచ్చని పేర్కొంటున్నారు. అసలు ఆరోపణలపై విచారణ ప్రారంభించారా? విచారణాధికారిని నియమించారా? ఇప్పటివ రకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు శాఖ నుంచి స్పష్టమైన సమాధానం రాలేదని అంటున్నారు.
మరోవైపు ఫిర్యాదుదారుడి పేరు, సంబంధిత ఉద్యోగి పేరు ఒకటే ఉన్నట్లు శాఖ పేర్కొంటూ గుర్తింపు నిర్ధారణ కోసం ఆధార్ లేదా ఇతర గుర్తింపు పత్రం సమర్పించాలని కోరింది. దీనికి సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఫిర్యాదుదారుడు తెలిపారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్, సీడబ్ల్యూసీ, మహిళా శిశు సంక్షేమ శాఖల రికార్డులను సమన్వయం చేసి స్వతంత్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైన రిజిస్టర్లు, దరఖాస్తులు, నిధుల విడుదల వివరాలు, విధుల నిర్వహణకు సంబంధించిన రికార్డులను భద్రపరిచి పరిశీలించాలని కోరుతున్నారు. ఆరోపణలు విచారణలో నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.బాలల గోప్యతను కాపాడటం ఎంత ముఖ్యమో, వారి సంక్షేమం కోసం పనిచేసే వ్యవస్థలో పారద ర్శకత, జవాబుదారీతనం కూడా అంతే ముఖ్యమని ఫిర్యాదు దారుడు పేర్కొంటున్నారు. మరి ఈ ఆరోపణలపై సంబ ంధిత శాఖ సమగ్ర విచారణ చేపట్టి స్పష్టత ఇస్తుందా? లేక చట్టప రమైన నిబంధనల ప్రస్తావనతోనే వ్యవహారం ముగుస్తుందా? అనేది వేచి చూడాల్సి ఉంది.

2లో

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

ప్రతి కుటుంబానికి
5 లక్షల జీవిత బీమా భరోసా



- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా
- ఆపద సమయంలో ఆర్థిక రక్షణ
- గొర్రె కిరణ్ కుమార్

హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించి, కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆర్థిక భరోసా అందించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన లక్ష్యమని 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ అన్నారు.వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా శనివారం హసన్‌పర్తి 66వ డివిజన్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి,మహాలక్ష్మి, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, చేయూత పింఛన్లు, రైతుభరోసా,రైతు రుణమాఫీ వంటి పథకాలతో పేద ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు,మహిళా శక్తి భవనాలు,విద్యార్థులకు అల్పాహార పథకం,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్,హాస్టల్ విద్యార్థులకు కాస్మాటిక్ సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎస్సీ, బీసీ, మైనారిటీ నాయకులు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం
రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



- నమోదు విధానాన్ని తనిఖీ చేసిన మండల ప్రత్యేక అధికారి

హసన్‌పర్తి,(జోర్దార్ ప్రతినిధి)తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారి మోహన్ శనివారం పరిశీలించారు.హసన్‌పర్తి మండలంలోని బైరాన్‌పల్లి, సిద్ధాపూర్,అర్వపల్లి, మల్లారెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లోబీమా పథకానికి సంబంధించిన నమోదు విధానాన్ని,రిజిస్ట్రేషన్ ప్రక్రియ తీరును క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అర్హులైన కుటుంబాల వివరాలను పథకంలో నమోదు చేసే విధానం, వివరాల సేకరణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాటిస్తున్న నిబంధనలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి తెలిపారు.ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించి, కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆర్థిక భరోసా అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుమనవాణి, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్, ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో
వల్లభాపూర్ విద్యార్థుల ప్రతిభ



- మండలస్థాయిలో ప్రథమ స్థానం
- జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ఎల్కతుర్తి,జోర్దార్ ప్రతినిధి:మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్,ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీల్లో వల్లభాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు.ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పదో తరగతి విద్యార్థి పోలోజు నిక్షిత్,తొమ్మిదో తరగతి విద్యార్థి పోతిరెడ్డి నిహారిక,ఎనిమిదో తరగతి విద్యార్థి పోతిరెడ్డి సాత్విక్ ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానం సాధించారు.వీరు నవంబర్ 28న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

అలాగే ఇంగ్లీష్ ఒలింపియాడ్ జూనియర్ విభాగంలో పోతిరెడ్డి మన్విత మండలస్థాయిలో ప్రథమ స్థానం సాధించి,

డిసెంబర్ 19న జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బద్దం సుదర్శన్ రెడ్డి తెలిపారు.

విద్యార్థుల ప్రతిభను గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత, ఉపసర్పంచ్ అంబాల అనిల్ కుమార్ అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమా దేవి, శోభారాణి,పద్మలత తదితరులు పాల్గొన్నారు.

మిరప ప్రాసెసింగ్‌తో మహిళలకు ఉపాధి బాట!



- విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ..
- ఇంక్యుబేషన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- చిన్న పరిశ్రమల స్థాపనతో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- కేవీకే శాస్త్రవేత్తలు

రామగిరిఖిల్ల,జోర్దార్ ప్రతినిధి:గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మిరప ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), రామగిరిఖిల్ల ఆధ్వర్యంలో నిఫ్టెమ్, నాబార్డ్ సంయుక్త సహకారంతో శనివారం కేవీకేలోని జిల్లా స్థాయి వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

ముడి సరుకుతో కాదు.. విలువ ఆధారిత ఉత్పత్తులతో అధిక ఆదాయం

ఈ సందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా. కె. వెంకట రమేష్ మాట్లాడుతూ, వ్యవసాయ ఉత్పత్తులను ముడి సరుకుగా విక్రయించడం కంటే వాటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి మార్కెట్‌లో విక్రయిస్తే అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. గ్రామీణ మహిళలు ఆహార ప్రాసెసింగ్ రంగంలో పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కేవీకేలో ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రారంభ దశలోనే భారీ పెట్టుబడులతో యంత్రాలు కొనుగోలు చేయకుండా, కేంద్రంలో అందుబాటులో ఉన్న ఆధునిక సదుపాయాలను వినియోగించుకొని నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. మహిళలు



స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకోవాలని పిలుపు నిచ్చారు.

మిరపతో ఎన్నో ఉత్పత్తులు.. మార్కెట్లో మంచి అవకాశాలు

గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డా. బి. నవ్య మాట్లాడుతూ మిరపతో మిరప పొడి, మిరప రేకులు, మసాలా మిశ్రమాలు వంటి పలు విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మార్కెటింగ్ చేసుకోవచ్చని వివరించారు. నాణ్యమైన ముడి సరుకు ఎంపిక, శాస్త్రీయ ప్రాసెసింగ్, పరిశుభ్రత, ప్యాకేజింగ్, నిల్వ పద్ధతులు, ఆహార భద్రతా ప్రమాణాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఇంక్యుబేషన్ కేంద్రంలోని యంత్రాలను వినియోగించి స్వయంగా ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా వ్యాపార నిర్వహణపై ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చని తెలిపారు.

యంత్రాల పనితీరుపై అవగాహన

మిరప ప్రాసెసింగ్ యూనిట్ ఇన్‌చార్జి సాయి కళ్యాణ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న యంత్ర పరికరాలు, వాటి పనితీరు, ప్రాసెసింగ్ విధానాలను వివరించారు. శిక్షణలో భాగంగా మహిళలకు ఉత్పత్తుల తయారీపై ప్రయోగాత్మక అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. బి. భాస్కర్ రావు, డా. కిరణ్ పిల్లి, డా. టి. వినోద్ కుమార్ పాల్గొన్నారు. మొత్తం 45 మంది గ్రామీణ మహిళలు శిక్షణలో ఉత్సాహంగా పాల్గొని మిరప ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఆసక్తి చూపారు. భవిష్యత్తులో ఇంక్యుబేషన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి రంగంలో ముందుకు సాగుతామని మహిళలు ఆకాంక్షించారు

మూడు పార్టీల ఐక్యతతో
సీపీఎం అభ్యర్థికి సర్పంచ్ పగ్గాలు

- టీడీపీ,వైసీపీ,సీపీఎం ఏకగ్రీవ నిర్ణయం
- గ్రామాల అభివృద్ధే లక్ష్యం

చింతూరు,ఏపీ స్టేట్ జోర్దార్ ప్రతినిధి:రాజకీయ పార్టీల మధ్య ఐక్యతకు నిదర్శనంగా కూటూరు గ్రామ పంచాయతీలో టీడీపీ, వైసీపీ, సీపీఎం పార్టీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. మూడు పార్టీల నాయకులు పరస్పర చర్చల అనంతరం ఏకగ్రీవంగా సీపీఎం అభ్యర్థిని సర్పంచిగా ఎంపిక చేయాలని తీర్మానించడం హర్షణీయమని సీపీఎం మండల కమిటీ పేర్కొంది.

పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కూటూరు పంచాయతీ పరిధిలో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం తదితర సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయనున్నట్లు వెల్లడించింది.తమపై నమ్మకం ఉంచిన గ్రామ ప్రజలకు,



మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలకు సీపీఎం మండల కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేసింది.

అధికారుల నిర్లక్ష్యంతో
చెరువు శిఖం భూములకు కబ్జాల బెడద

- గంగోని కుంట ఆక్రమణలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య

హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)అధికారుల నిర్లక్ష్యం కారణంగా హుజూరా బాద్‌లోని చెరువు శిఖం భూములు కబ్జాలకు గురవుతున్నాయని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ఆరోపించారు. గంగోని కుంట శిఖం భూమిని గత రెండు రోజులుగా ఓ వ్యక్తి ఆక్రమిస్తున్నా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు స్పందించడం లేదని విమర్శించారు.గంగోని కుంట భూముల ఆక్రమణపై విచారణకు వచ్చిన ఇరిగేషన్ డీఈ రవికుమార్, ఏఈ సాయికుమార్‌లతో సమ్మయ్య మాట్లాడి, ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇదే భూమిని ఆక్రమించి బేస్‌మెంట్ నిర్మించిన వ్యక్తిపై అప్పటి ఎంఆర్ఓ ఎన్. రవి క్రిమినల్ కేసు నమోదు చేయించి జైలుకు పంపిన విషయాన్ని గుర్తుచేశారు.



గంగోని కుంట, గుండ్ల చెరువులకు ఇప్పటివరకు హద్దులు నిర్ణయించక పోవడంతో ఆక్రమణలు కొనసాగుతున్నాయని, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి చెరువు భూములను కాపాడాలని కోరారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ముఖ్యమంత్రిని కలిసి హుజూరాబాద్‌లో హైడ్రా తరహా సంస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ ఉద్యమిస్తామని సమ్మయ్య హెచ్చరించారు.

లక్షల మందిలో ప్రత్యేక గుర్తింపు
దక్షిణ కొరియాలో పెద్దపల్లి వాసికి పురస్కారం!

- 8.3 లక్షల మంది అడ్వైజర్లలో 334 మందికే సీఈఓ క్లబ్‌లో చోటు
- అంతర్జాతీయ వేదికపై కొక్కుల సురేష్ ప్రతిభకు గుర్తింపు

రామగిరి జోర్దార్ ప్రతినిధి:లక్షలాది మంది పోటీ పడే రంగంలో తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సాధించి, అంతర్జాతీయ వేదికపై అవార్డు అందుకోవడం ద్వారా పెద్దపల్లి జిల్లాకు చెందిన కొక్కుల సురేష్ గర్వకారణంగా నిలిచారు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలో అడ్వైజర్‌గా పనిచేస్తున్న ఆయన దేశ వ్యాప్తంగా సుమారు 8.3 లక్షల మంది అడ్వైజర్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, కేవలం 334 మందికి మాత్రమే దక్కిన ప్రతిష్ఠాత్మక సీఈఓ క్లబ్‌లో స్థానం సంపాదించారు.ఈ అరుదైన ఘనతకు గుర్తింపుగా దక్షిణ కొరియాలో నిర్వహించిన అంతర్జాతీయ కార్యక్రమంలో సీఈఓ క్లబ్ అవార్డును అందుకున్నారు. వృత్తిపట్ల అంకితభావం, నిరంతర కృషి, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకున్నట్లు సురేష్ తెలిపారు.తన విజయానికి కష్టమర్ల నమ్మకం, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం,



స్నేహితులు, శ్రేయోభిలాషుల సహకారం ఎంతో తోడ్పడ్డాయని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా నుంచి ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు పొందిన ఏకైక అడ్వైజర్‌గా నిలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.సురేష్ సాధించిన ఈ ఘనత పట్ల స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ అధికారులు, సహచరులు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు. స్థానికంగా కూడా ఆయన విజయంపై హర్షం వ్యక్తమవుతోంది.

టీఎస్ ఒలింపియాడ్, ఎడ్‌టాక్ పోటీల్లో
భీమారం విద్యార్థుల ప్రతిభ



- మండల స్థాయిలో ప్రథమ స్థానాలు
- జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి టీఎస్ ఒలింపియాడ్,ఎడ్‌టాక్ పోటీల్లో భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాలు సాధించారు.పాఠశాలకు చెందిన ఈ.సిరి గీతిక, వి. అక్షిత,డి. పూజిత,జి. తరుణ్ తేజ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.విద్యార్థుల విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.శ్రీనివాస్, ఉపాధ్యాయులు బంగారు స్వామి,మస్రత్ బేగం, తిరుపతి,సరోజ,శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి
ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాసుదేవరెడ్డి



హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాసుదేవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డీసీహెచ్ కృష్ణప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్య బృందం ఆయనను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపింది. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డితో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెల్పూర్‌లో రాష్ట్రస్థాయి టచ్ రగ్బీ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:కరీంనగర్ జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ టచ్ రగ్బీ అసోసియేషన్ సహకారంతో రెండవ అంతర్ జిల్లా రాష్ట్రస్థాయి టచ్ రగ్బీ ఛాంపియన్‌షిప్ చెల్పూర్‌లో నిర్వహిస్తున్నారు. నవంబర్ 20 నుంచి 23 వరకు చెల్పూర్‌లోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులుపాల్గొంటున్నారు.ఈ కార్యక్రమానికి ఎస్సై రవి, సర్పంచ్



వంతడుపుల కస్తూరి, సొన్వి చైర్మన్ మణిందర్ శెట్టి, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ,మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సారయ్య తదితరులు హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ క్రీడలతో యువతలో ఆరోగ్యం, క్రమశిక్షణ,నాయకత్వ లక్షణాలు,జట్టుకృషి పెంపొందుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
ఆదివారం,
నవంబర్ 22 2026

పెన్షన్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న
కాంగ్రెస్ ప్రభుత్వం

● హుజురాబాద్ నియోజకవర్గంలో 1,029 పెన్షన్లకు కోత

● ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపణ



హైదరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పెన్షన్లు ఇవ్వకపోగా, ఉన్న పెన్షన్లలో కోతలు విధిస్తోందని విమర్శించారు.తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హుజురాబాద్ నియోజకవర్గంలో మొత్తం 5,250 పెన్షన్లను తొలగించగా, 4,221 మాత్రమే మంజూర య్యాయని, దీంతో 1,029 పెన్షన్లకు కోత పడిందని తెలిపారు. మండలాల వారీగా హుజురాబాద్‌లో 91, జమ్మికుంట రూరల్‌లో 91, కమలాపూర్‌లో 471, వీణవంకలో 183, ఇల్లంతకుంటలో 298 పెన్షన్లు తగ్గాయని వివరించారు. జమ్మికుంట పట్టణంలో 5, హుజురాబాద్ పట్టణంలో 100 పెన్షన్లు పెరిగాయని పేర్కొన్నారు.
తన వద్ద పెన్షన్ల తొలగింపునకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, తన లెక్కలు తప్పని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. తన లెక్కలు నిజమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామాకు సిద్ధమా అని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ 45 లక్షల మందికి పెన్షన్లు అందించి పేదలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు భరోసా కల్పించే పెన్షన్లను తొలగించడం అన్యాయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు తొలగించిన పెన్షన్లను వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మత్స్యకారుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా

● ఎమ్మెల్యే



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని ఆదిలాబాద్‌లోని గంగపుత్ర సంఘు భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని గంగాదేవి, భీష్ముడి చిత్రపటాలకు పూజలు చేశారు. మత్స్యకారుల సమస్యలను రాబోయే శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించి, పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ హామీ ఇచ్చారు. మత్స్యకార కుటుంబాల జీవనోపాధి కోసం ఖానాపూర్ చెరువులోని గొర్రవు డెక్కను తొలగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మృత్యకార సంఘం జిల్లా అధ్యక్షులు వెల్లుల భోజన్న ప్రధాన కార్యదర్శి మేకల అశోక్ పాల్గొన్నారు.

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు

● సుదర్శన్ రెడ్డి



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదిలాబాద్ లో నిర్వహించిన చేయూత పెన్షన్ పథకం ప్రొసీడింగ్ కాపీల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలు ఆయన అందజేశారు. అంతకుముందు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కర పత్రాలను ఆవిష్కరించారు.
ఎమ్మెల్యే పాయల్ శంకర్, కలెక్టర్ రాజర్షిషా పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల పరిరక్షణకు
డిసెంబర్ 9న భారీ బహిరంగ సభ

● మానుకోట సభను విజయవంతం చేయాలని నాయకుల పిలుపు



ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి):ఆదివాసీల ఉద్యోగ, ఉపాధి అవకాశాలను లంబాడాలు కొల్లగొడుతున్నారని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేశ్, కొలం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సోనేరావు ఆరోపించారు. ఆదివాసీ తొమ్మిది తెగల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 9న మానుకోటలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



● చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో 120 మంది విద్యార్థుల భాగస్వామ్యం

హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:మండలంలోని టీజీఆర్ఎస్ (బాలికల) పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఐటీ వరంగల్ బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రామరాజు, మండల విద్యాధికారి ఏ. శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ రామరాజు మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల్లో జరిగే మార్పులను గమనిస్తూ,వాటి వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను తెలుసుకోవాలని సూచించారు.మండల విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ మూఢనమ్మకాలను విడనాడి,సైన్స్ పట్ల ఆసక్తి, పెంచుకోవాలని సూచించారు.జపాన్ విద్యావిధానంలోని క్రమశిక్షణ,సమయపాలన, స్వీయ నిర్వహణ వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. మండల ఇన్‌చార్జి డాక్టర్ ఎం. సారంగపాణి మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని, విశ్లేషణాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించు కోవాలని కోరారు.
పోటీల్లో ప్రథమ స్థానంలో జెడ్పీహెచ్ఎస్ సీతంపేట, టీజీఆర్ఎస్ (బాలికలు) హసన్‌పర్తి, గ్రీన్ వుడ్ హైస్కూల్ నిలిచాయి. ద్వితీయ స్థానంలో జెడ్పీహెచ్ఎస్ భీమారం, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ సుబ్బయ్యపల్లి, ఆర్బిట్ ఈ-టెక్నో స్కూల్, తృతీయ స్థానంలో జెడ్పీహెచ్ఎస్ వంగపాడు,ఎంజేపీ తిమ్మాపూర్,సాకేత్ హైస్కూల్ నిలిచాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జేవీవీ మండల కోఆర్డినేటర్లు నాగరాజు,వేణుగోపాల్, సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కాంప్లెక్స్‌లో ఉద్యోగం పేరుతో
రూ.1.20 లక్షల మోసం

● ఇద్దరు నిందితుల అరెస్టు.. మరొకరు పరారీ



ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి): కోర్టు కాంప్లెక్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.1.20 లక్షలు వసూలు చేసిన ముగ్గురిపై ఆదిలాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చునార్కర్ అశోక్, నేరువట్ల దేవరాజు అలియాస్ దేవేందర్లను అరెస్టు చేసినట్లు సీఐ రహీం పాషా శుక్రవారం తెలిపారు. మరో నిందితుడు నాగరాజు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

పదేళ్లుగా సదరం సర్టిఫికెట్ కోసం నిరీక్షణ

● అర్హత ఉన్నా పింఛన్ అందడం లేదు

● న్యాయం చేయండి

● బాధితుడు యాదగిరి ఆవేదన



హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వికలాంగుడిగా మారిన తనకు పింఛన్ పొందేందుకు అవసరమైన సదరం సర్టిఫికెట్ పదేళ్లుగా మంజూరు కావడం లేదని హుజురాబాద్ మండలం రాంపూర్ శివారులోని కొత్త దయానగర్ కాలనీకి చెందిన ముషం యాదగిరి (61) ఆవేదన వ్యక్తం చేశారు.
2014లో జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదగిరి కుడికాలు, తొంటి ఎముకలు విరిగిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి రాడ్లు అమర్చారు. అప్పటి నుంచి వికలాంగుడిగా జీవనం సాగిస్తున్నారు. 2015-16లో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన సదరం శిబిరానికి హాజరు కాగా, 60 శాతం వైకల్యం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారని, ఒరిజినల్ సర్టిఫికెట్ ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు అందలేదని తెలిపారు. కూలీ,మెకానిక్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించిన తనకు ప్రస్తుతం ఆరోగ్యం సహకరించడం లేదని, భార్య బీడీలు చుడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తోందని వివరించారు. ఇద్దరు కుమార్తెలతో ఒకే గదిలో దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నామని కన్నీటిపర్యంతమయ్యారు.
పదేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదని, జిల్లా కలెక్టర్, హుజురాబాద్ ఆర్డీవో, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి సదరం సర్టిఫికెట్ మంజూరు చేయడంతో పాటు అర్హత మేరకు పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

ఆముద గింజలు తిని
ఆరుగురు చిన్నారులకు అస్వస్థత

● మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలింపు



ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి): గాదిగూడ మండలం లోకారి (బి) గ్రామంలో ఆముద గింజలు తిని ఆరుగురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఆడుకుంటూ చెట్టు వద్ద ఉన్న ఆముద గింజలను తిన్న చిన్నారులు ఇంటికి వచ్చిన తర్వాత వాంతులు, కడుపునొప్పితో బాధపడ్డారు. దీంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈఎంటీ దత్తాత్రి, పైలట్ సుందర్ చిన్నారులను తరలించడంలో సేవలందించారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో
శ్రీనిధి నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:
ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవ ముగింపు కార్యక్రమంలో బాల కేంద్రానికి చెందిన గడ్డం శ్రీనిధి నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

చేతుల్లో దీపాలు పట్టుకొని, తలపై దీపాన్ని ఉంచుకొని చేసిన నృత్యంతో ప్రేక్షకులను అలరించింది.

అంతేకాకుండా మేకులపై నృత్యం చేస్తూ తన ప్రతిభను చాటుకొని అందరినీ అబ్బురపరిచింది. ఆమె ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది.

ఈ నెల 23న కరీంనగర్‌లో
బీజేపీ మహాపాదయాత్ర



● మహాపాదయాత్ర విజయవంతానికి హుజురాబాద్‌లో సన్నాహక సమావేశం

హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తూ దుష్ప్రచారం చేస్తున్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు.ఈ ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ నెల 23న కరీంనగర్‌లో నిర్వహించనున్న మహాపాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారుఈ సందర్భంగా బీజేపీ హుజురాబాద్ పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో మహాపాదయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర సంస్థాగత సంయుక్త ప్రధాన కార్యదర్శి దశరథ్ జీ,మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరయ్యారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని, ఎన్నికల ప్రక్రియపై అపోహలు తొలగించేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ నెల 23న జరిగే మహాపాదయాత్రలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పాల్గొననున్న నేపథ్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.
ఈ సమావేశంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు తూర్పాటి రాజు,పెరుపల్లి కొండల్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు,మాజీ అధ్యక్షులు,జిల్లా, పట్టణ పదాధికారులు,వివిధ మోర్చాల ప్రతినిధులు, బూత్ అధ్యక్షులు, ఇన్‌చార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం
బీఆర్ఎస్‌లో చేరికలను జీర్ణించుకోలేక అసత్య ప్రచారం

● టేకుమట్లలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ విమర్శలు..

● త్వరలో మరిన్ని చేరికలు: ఆకుల రవీందర్



టేకుమట్ల, జోర్దార్ ప్రతినిధి:టేకుమట్ల మండలంలో బీఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందుతున్నారని, పార్టీలో జరుగుతున్న చేరికలను జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ విమర్శించారు. టేకుమట్ల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో మాజీ ఎస్ఆర్ఎస్పీ చైర్మన్ ఆకుల రవీందర్, అంకుషాపూర్ మాజీ సర్పంచ్ పండుగ శ్రీనివాస్‌తో పాటు సుమారు 40 మంది బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. గతంలో బీఆర్ఎస్‌లో పనిచేసిన వారే తిరిగి చేరారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ అవివేకానికి నిదర్శనమన్నారు.
ఆకుల రవీందర్ మొదటి నుంచి టీడీపీ రాజకీయ నేపథ్యం కలిగిన వ్యక్తి అని, గంద్ర సత్యనారాయణరావు కాంగ్రెస్‌లో చేరిన అనంతరం ఆయన గెలుపు కోసం పలు గ్రామాల్లో కష్టపడి పనిచేశారని రవిగౌడ్ పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే అనుసరిస్తున్న విధానాలు, స్థానిక నాయకుల వ్యవహారశైలిపై అసంతృప్తితో కేసీఆర్ నాయకత్వంపై నమ్మకంతో బీఆర్ఎస్‌లో చేరినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన వారిలోనూ గతంలో బీఆర్ఎస్‌లో పనిచేసిన వారు ఉన్నారని, అలాంటప్పుడు బీఆర్ఎస్ చేరికలపై విమర్శలు చేయడం సరికాదన్నారు.
ఈ సందర్భంగా ఆకుల రవీందర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పగలు, రాత్రి తేడా లేకుండా ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలుపు కోసం పనిచేశానని, ఎన్నికల కౌంటింగ్ సమయంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఏజెంట్‌గా కూడా వ్యవహరించానని గుర్తుచేశారు. తాను కాంగ్రెస్ కోసం పనిచేశానా లేదా అనే విషయంపై బహిరంగంగా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కోవాలని, వ్యక్తిగత ఆరోపణలు, అసత్య ప్రచారాలకు దిగవద్దని సూచించారు. తాను ఎక్కడ ఉన్నా ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనతో పనిచేస్తానని మరికొందరు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరలో వందలాది మంది చేరికలు ఉంటాయని ప్రకటించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీల అమలులో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతుబంధు చెల్లింపుల్లో జాప్యం, యూరియా, ఎరువుల సరఫరాలో ఇబ్బందులు, యాసంగి సాగుపై రైతుల్లో నెలకొన్న ఆందోళనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వ్యవహారశైలిపై కూడా ప్రజలు, కార్యకర్తల్లో అసంతృప్తి ఉందని, నాయకులకు గౌరవం ఇవ్వడం లేదని, అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇసుక తదితర వ్యవహారాల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై విచారణ జరిపించి నిజానిజాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.
కేసీఆర్ పాలనలో అమలైన రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ, ఆసరా పింఛన్లు వంటి పథకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, టేకుమట్ల మండలంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.
ఈ సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, నాయకులు బందెల నరేష్, ఆది రఘు, పోతనవేణి ఐలయ్య, పింగిలి వెంకటేశ్వరరెడ్డి, బిళ్లకంటి ఉమేందర్‌రావు, పొన్నం చంద్రయ్య, మారం లింగారెడ్డి, గువ్వాడి లక్ష్మణ్, బొడ్డు సదానందం, స్థానిక సర్పంచ్ మాట్ల శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విజ్ఞానం అందించేది గ్రంథాలయం

● పాఠశాలలో నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించిన డీఈవో



ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)ఆదిలాబాద్‌లోని రణదివేనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని జిల్లా విద్యా శాఖ అధికారి మాధవి శనివారం ప్రారంభించారు. అనంతరం పాఠశాలలోని మిద్దె తోటను సందర్శించి ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం, పఠనాసక్తి పెరుగుతాయని, అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి లక్ష్మణ్, ఆరోగ్య పాఠశాల కన్వీనర్ అజయ్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం
రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వేముల మహేందర్ గౌడ్

- నియామకంపై ఉద్యమకారులు,బీసీ సంఘాల హర్షం



మొగుళ్లపల్లి,(జోర్దార్ ప్రతినిధి)జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వేముల మహేందర్ గౌడ్ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తమ్మల శోభారాణి ఉత్తర్వులు జారీ చేశారు.మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, యువతను చైతన్య పరుస్తూ కీలక పాత్ర పోషించిన మహేందర్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ పొలిటికల్ జేఏసీ,విద్యార్థి జేఏసీల్లో బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగాకొనసాగుతున్నారు. ఉద్యమకారులకు గుర్తింపు,ఆత్మగౌరవం కల్పించాలనే నినాదంతో వరంగల్ నుంచి హైదరాబాద్ గన్‌పార్క్ వరకు ఆత్మగౌరవ పాదయాత్ర చేపట్టనున్నట్లు శోభారాణి ప్రకటించారు. మహేందర్ గౌడ్ నియామకంపై జిల్లా ఉద్యమకారులు,బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పరిశుద్ధ్య కార్మికురాలిపై దాడి.. మాదిగ ఐక్యవేదిక ఆగ్రహం!

- నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలి
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి

మంథని,జోర్దార్ ప్రతినిధి:నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న దళిత మహిళా కార్మికురాలు చందుపట్ల రమణమ్మపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మంథని డివిజన్ మాదిగల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు.ఈనెల 19న నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 45వ వార్డు డివిజన్‌లో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న రమణమ్మపై బాలకృష్ణ అనే వ్యక్తి దాడి చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ ఘటనను



తీవ్రంగా ఖండించిన వారు, నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికురాలిపై దాడి చేయడం దారుణమని అన్నారు. భవిష్యత్తులో దళితులపై ఇలాంటి దాడులు జరిగితే సహించేది లేదని, బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రోజు రోజుకు దళితులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి ఘటనల నియంత్రణకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాదిగల ఐక్యవేదిక నాయకులు వేల్పుల రాజు, రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. రాజయ్య, బూడిద తిరుపతి, మంథని రాకేష్, నాగెల్లి మహేష్, కొయ్యల మొండి, ఇందారపు నవీన్, వేల్పుల శ్రావణ్, కన్నూరి బాపు, వేల్పుల సురేష్, విరుగురాల ప్రసాద్, కొయ్యల రాయమల్లు, వేల్పుల శరత్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఆసరా పింఛన్లు రద్దు చేస్తున్నారన్న ప్రచారం అవాస్తవం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తాం
- తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు..
- దొగ్గల భాస్కర్ స్పష్టీకరణ

జమ్మికుంట, జోర్దార్ ప్రతినిధి:హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితులకు దళితబంధు పథకం అందినందున ఆసరా పింఛన్లు రద్దయ్యాయని, ఇకపై పింఛన్లు రావని కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జమ్మికుంట మండల అధ్యక్షుడు దొగ్గల భాస్కర్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల సంక్షేమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గత పదేళ్ల పాలనలో కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయని వారు, ప్రస్తుతం ప్రజాపాలన ప్రభుత్వం అర్హులకు సంక్షేమ ఫలాలు అందిస్తుంటే జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆసరా పింఛన్ మంజూరు ప్రొసీడింగ్స్ కాపీలు అందిన వారికి మాత్రమే పింఛన్లు వస్తాయనే ప్రచారం కూడా అవాస్తవమని పేర్కొన్నారు. అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులతో పాటు అర్హులైన దళితులందరికీ ప్రభుత్వం పింఛన్లు అందిస్తుందని తెలిపారు.ఇతర రాజకీయ పార్టీల నాయకులు లేదా మరెవరైనా చెప్పే తప్పుడు ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్లు అందించేందుకు ప్రజాపాలన ప్రభుత్వం కట్టుబడి ఉందని దొగ్గల భాస్కర్ వెల్లడించారు.



రామగుండంలో వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్

హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)కాళేశ్వరం జోన్‌కు సంబంధించిన వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయాన్ని రామగుండంలో, ఖమ్మం జిల్లాలో మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ కమర్షియల్ టాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు విజ్ఞప్తి చేశారు.రామగుండంలో కార్యాలయం ఏర్పాటు చేస్తే ఉద్యోగులకు ప్రయాణ ఇబ్బందులు తగ్గుతాయని, ఖమ్మంలో కార్యాలయం ఏర్పాటు వల్ల పన్నుల వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఎం. రఘునందన్ రావు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త సీటీఓ కార్యాలయాల ఏర్పాటు వల్ల జీఎస్టీ ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, ప్రభుత్వ ఆదాయం దృష్ట్యా రామగుండం, ఖమ్మంలో కొత్త కార్యాలయాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలి



- మార్నింగ్ వాకర్స్‌ను కలిసి ఓటు అభ్యర్థించిన రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

వరంగల్,(జోర్దార్ ప్రతినిధి)వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నల్గొండ-వరంగల్--ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి శనివారం హనుమ కొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్, జేఎంఎస్ గ్రౌండ్, పబ్లిక్ గార్డెన్‌లో మార్నింగ్ వాకర్స్‌ను కలిశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ ఝాన్సీరాణి, రవీందర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి విష్ణుదాసు వంశీధర్‌రావు,జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గూడెపు మొగిలయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి విశేష స్పందన



- రామగిరి మండలంలో ఒక్కరోజే 526 రిజిస్ట్రేషన్లు
- బుధవారం పేటలో అత్యధికంగా 116..
- రాజాపూర్‌లో 90, పన్నూరులో 76 నమోదు

రామగిరి, జోర్దార్ ప్రతినిధి:రామగిరి మండలంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు గాను పెద్దంపేట మినహా మిగిలిన అన్ని గ్రామ పంచాయతీల్లో నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం ఒక్కరోజే మండలవ్యాప్తంగా 526 రిజిస్ట్రేషన్లు నమోదైనట్లు ఎంపీడీవో శైల జారాణి తెలిపారు.గ్రామాల వారీగా పరిశీలిస్తే బుధవారం పేట గ్రామ పంచాయతీలో అత్యధికంగా 116 రిజిస్ట్రేషన్లు నమోదు కాగా, రాజాపూర్‌లో 90, పన్నూరులో 76 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. మిగిలిన గ్రామ పంచాయతీల్లోనూ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.ఈ సందర్భంగా రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎంపీడీవో శైల జారాణి స్వయంగా పరిశీలించారు. నమోదు కార్యక్రమం సజావుగా జరిగేలా సిబ్బందికి పలు సూచనలు చేశారు.అర్హులైన కుటుంబాలన్నీ ఈ పథకంలో నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

చెల్వూరు గ్రామానికి జయన్న ఫౌండేషన్ వైకుంఠ రథం బహూకరణ



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:సేవా కార్యక్రమాల్లో భాగంగా జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో హుజురాబాద్ మండలం చెల్వూరు గ్రామపంచాయతీకి నూతన వైకుంఠ రథాన్ని ఫౌండేషన్ అధినేతలు గుడిపాటి జైపాల్‌రెడ్డి, సరిత దంపతులు బహూకరించారు.శనివారం సర్పంచ్ వంతడుపుల కస్తూరికి రథం తాళాలను అందజేశారు.

ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ స్థలం కేటాయిస్తే గంటకు 2 వేల లీటర్ల సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, లీటరు రూ.3కే శుద్ధజలం అందిస్తామని తెలిపారు. రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యతను కూడా ఫౌండేషన్ తీసుకుంటుందని, కూల్ వాటర్ ప్లాంట్‌తో పాటు 50 వాటర్ క్యాన్లను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు.శంకర ఐ హాస్పిటల్ సహకారంతో ఇప్పటివరకు 7 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 1,300 మందికి పైగా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ఆదరణకు నోచుకోని వృద్ధుడికి స్వయంగా కొడుకుగా నిలిచి కంటి ఆపరేషన్ చేయించిన ఘటనను వివరించడంతో సభలో భావోద్వేగం నెలకొంది.

ఈ సందర్భంగా గ్రామస్తులు జైపాల్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నాగేపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



- అర్హులైన ప్రతి కుటుంబం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి -
- సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ యాదవ్

రామగిరి, జోర్దార్ ప్రతినిధి:రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గ్రామ సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, ఆపద సమయంలో అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు చేరవేసేందుకు గ్రామ పంచాయతీ తరపున కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాసం సతీష్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అంతమ్మ వైద్య చికిత్సకు 2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు



వికారాబాద్,(జోర్దార్ ప్రతినిధి) మర్పల్లి మండలం కోటమరపల్లి గ్రామానికి చెందిన పులిపిరి ఎల్లయ్య భార్య అంతమ్మ వైద్య చికిత్స కోసం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల విలువైన ఎల్ఓసీని తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంతమ్మ కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని ఆయన ఈ సాయం అందేలా చొరవ తీసుకున్నారు.

అంతమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని స్పీకర్ భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంతమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మారయ్య మృతి పట్ల సిరికొండ మధుసూదనాచారి సంతాపం



హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి):కాట్రపల్లి గ్రామానికి చెందిన కాసగోని మారయ్య మృతి పట్ల తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి సంతాపం వ్యక్తం చేశారు.
మృతుడి కుమారులు జై గౌడ అధికార ప్రతినిధి కాసగోని శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసగోని కిరణ్ కుమార్ గౌడ్‌లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

జిల్లా స్థాయికి ఎంపికైన టీజీఎంఎస్ దర్యాపూర్ విద్యార్థులు



ముత్తారం జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల, దర్యాపూర్ విద్యార్థులు వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షలో తొమ్మిదో తరగతి విద్యార్థి విష్ణుసాయి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.
అదేవిధంగా మధ్యాహ్నం నిర్వహించిన మండల స్థాయి చెకుముకి విజ్ఞాన శాస్త్ర పోటీల్లో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థుల బృందం జిల్లా స్థాయికి ఎంపికైంది.
ఈ సందర్భంగా విద్యా ర్థుల విజయంపై మండల విద్యాధికారి హరిప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సంతోష్ కుమార్ కేసరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ముల్కనూరులో చెకుముకి టాలెంట్ టెస్ట్



● జిల్లా స్థాయి పోటీకి ఎంపికైన గట్ల నర్సింగాపూర్ విద్యార్థులు


భీమదేవరపల్లి, జోర్దార్ విలేఖరి :జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీని ముల్కనూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, జనవిజ్ఞాన వేదిక హనుమకొండ గౌరవ అధ్యక్షురాలు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి హాజరయ్యారు. గౌరవ అతిథిగా అదే కళాశాల ఆంగ్ల విభాగం ప్రొఫెసర్ శ్రీమతి మేఘన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముల్కనూర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి రవీందర్ అధ్యక్షత వహించారు.

ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి పాఠశాల స్థాయిలో విజేతలైన 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి పోటీల్లో గట్లనర్సింగాపూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన బి. సింహ, వి. అనుదీప్, జి. భాగ్యలక్ష్మి ప్రథమ స్థానాన్ని సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో జె. కార్తీక్, వి. కిరణ్ కుమార్, జి. శ్రీవల్లి ప్రథమ స్థానాన్ని సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కార్యదర్శి, చెకుముకి మండల ఇన్‌చార్జి రామంచ భిక్షపతి మాట్లాడుతూ.. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాలు సాధించిన రెండు జట్లు ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, పరిశీలనాశక్తి, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే చెకుముకి పోటీల ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

ఎల్టా ఆధ్వర్యంలో టెడ్ టాక్ పోటీలు



● జిల్లా స్థాయి పోటీలకు నలుగురు విద్యార్థుల ఎంపిక

భీమదేవరపల్లి జోర్దార్ విలేఖరి:ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, హనుమకొండ ఆధ్వర్యంలో మండల స్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్ మరియు టెడ్ టాక్ పోటీలను ముల్కనూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆంగ్ల విభాగం ప్రొఫెసర్ శ్రీమతి మేఘన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించడంతో పాటు, ఆత్మవిశ్వాసంతో ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మకత, భావవ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.మండల స్థాయి పరీక్షల నిర్వహణ బాధ్యతలను 'ఎల్టా' మండల టెస్ట్ ఇన్‌చార్జిలు రామంచ భిక్షపతి, కొత్తపల్లి శ్రీనివాస్ నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తెలంగాణ మోడల్ స్కూల్, ముల్కనూర్‌కు చెందిన ఎన్. ప్రజ్వల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గట్లనర్సింగాపూర్‌కు చెందిన యు. రిషిత,

జి. భాగ్యలక్ష్మి, ఎన్. నాగేశ్వరి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ముఖ్య అతిథి ప్రొఫెసర్ మేఘన, ప్రధానోపాధ్యాయులు దాసరి రవీందర్ అభినందించారు. విద్యార్థులు జిల్లా స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ముల్కనూర్ ప్రధానోపాధ్యాయులు దాసరి రవీందర్, ఆంగ్ల ఉపాధ్యాయులు శ్రీదేవి, సుకన్య, కొత్తపల్లి శ్రీనివాస్, ఎల్టా మండల టెస్ట్ ఇన్‌చార్జి రామంచ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఔషధ నియంత్రణ తనిఖీల్లో రాజకీయ జోక్యం ఉండకూడదు



● అర్హత కలిగిన ఫార్మసిస్టుల సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలి

● ప్రవీణ్ బొమ్మెర

కామారెడ్డి,(జోర్దార్ ప్రతినిధి)తెలంగాణవ్యాప్తంగా టీజీ సేఫ్, ఔషధ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో మందుల దుకాణాలు, ఆసుపత్రుల మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారని సీనియర్ ఫార్మసిస్ట్, ప్రజారోగ్య కార్యకర్త ప్రవీణ్ బొమ్మెర తెలిపారు. నకిలీ మందుల విక్రయాలు, అర్హత కలిగిన రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ లేకుండా మందుల దుకాణాలు నిర్వహించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు.

తనిఖీల నేపథ్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డితో పాటు ఇతర అధికారులకు వివిధ వర్గాల నుంచి ఫోన్ కాల్స్, ఒత్తిళ్లు వస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. అధికారులు తమ విధులను స్వతంత్రంగా నిర్వహించేందుకు రాజకీయ జోక్యం ఉండకూడదని స్పష్టం చేశారు.వైద్య సేవలు వైద్యులు,ఫార్మసీ సేవలు అర్హత కలిగిన ఫార్మసిస్టులే అందించాలని ఆయన పేర్కొన్నారు.డి-ఫార్మసీ, బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ చదివిన రిజిస్టర్డ్ ఫార్మసిస్టులకు తమ వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తించే అవకాశం కల్పించాలని కోరారు. కేవలం ఫార్మసీ నమోదు ధ్రువపత్రం ఉండటమే కాకుండా,అర్హత కలిగిన ఫార్మసిస్ట్ ప్రత్యక్షంగా సేవలు అందించడం ముఖ్య మన్నారు.ఔషధ నియంత్రణ విభాగం, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ తమ చట్టబద్ధమైన విధులను ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా స్వతంత్రంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ప్రవీణ్ బొమ్మెర విజ్ఞప్తి చేశారు.

హలో చెబుదాం బి ప్రేమతో కొత్త ప్రపంచాన్ని నిర్మిద్దాం

ఒక చిరునవ్వు
ఒక హలో
స్నేహానికి తొలి అడుగు

చిరునవ్వుతో పలికే
ఆ ఒక్క చిన్న మాట
మనసుల మధ్య వేస్తుంది
ఆత్మీయతకు బాట

మౌనపు గోడలను కరిగించే
మంత్రం అది
ఆందోళనను తుంచి
ఆప్యాయతలను పెంచే
సాధనం
అపరిచితులను సైతం
అక్కున చేర్చుకునే బంధం
అది

ఒంటరితనపు చీకట్లో చిన్న వెలుగు రేఖలా
బాధలో ఉన్న గుండెకు
ఓదార్పు ఇచ్చే ఊరటలా
ఎంతటి దూరాన్నైనా
చెరిపేసే శక్తి దానికి ఉంది
పరిచయం లేకున్న
పలకరింపుకు సాధనం హలో
మానవత్వపు పరిమళాన్ని
పంచే గుణం అందులో ఉంది

భాష ఏదైనా ప్రాంతం
ఎక్కడైనా "హలో "అనే
పిలుపులో ప్రేమ ఒక్కటే! ద్వేషాన్ని మరిపించి
శాంతిని నింపేది మనమంతా ఒకటే
అని గుర్తు చేసేది
పదిమందిని ఆప్యాయంగా పలకరిద్దాం
ప్రేమతో కూడిన కొత్త
ప్రపంచాన్ని నిర్మిద్దాం.

(నవంబర్21 ప్రపంచ హలో దినోత్సవం సందర్భంగా)



నేదునూరి కనకయ్య
రచయిత ఫ్రీలాన్స్
జర్నలిస్ట్ హైదరాబాద్
9440245771

సహృదయం-రసగీతం

స్పందన తేటతెల్లమైనప్పుడు
సహనం కవచమైనప్పుడు
వివేకం దీపమైనప్పుడు
మాట నిజాయితీగా నిలుస్తుంది

కరుణ చిగురించినప్పుడు
సాయం చేయి కలిసినప్పుడు
మమత పంచుకున్నప్పుడు
బతుకు పండుగౌతుంది

నమ్మకం బలమైనప్పుడు
శ్రమ నిజమైనప్పుడు
కల నిండైనప్పుడు
రేపు వెలుగులమయమౌతుంది

హృదయం విశాలమైనప్పుడు
కంఠం అమృతమైనప్పుడు
రసనాసాదులు సంగీతాన్నే పలికిస్తాయి

ఆలోచన ఉన్నతమైనప్పుడు
లక్ష్యం ఉదాత్తమైనప్పుడు
ఆచరణ ఆదర్శమైనప్పుడు
ఫలితం కళ్యాణమౌతుంది

ప్రతి సహృదయానికి ఉదయం అమృతమయం కావాలి.



కొమ్మిడి గోవర్ధన్ రెడ్డి

డేట్స్ ఆపిల్ ఖీర్

కావలసిన పదార్థాలు:ఖర్జూరాలు:పది, ఆపిల్: ఒకటి,పాలు: ఒక లీటర్, చక్కెర: ఒక కప్పు, యాలకుల పొడి: పావు టీస్పూన్, డ్రైఫ్రూట్స్: ఒక టేబుల్ స్పూన్.

తయారీ విధానం:ఆపిల్ పండును చిన్నచిన్న ముక్కలుగా కోయాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి అరకప్పు నీళ్లు పోసి ఆపిల్ ముక్కలు, ఒక టీస్పూన్ చక్కెర వేసి పది నిమిషాలపాటు సన్నని మంటపై ఉడికించి పక్కనపెట్టాలి. గింజ తీసిన ఖర్జూరాలను మిక్సీలో మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. స్టవ్‌మీద మందపాటి గిన్నెపెట్టి పాలు, చక్కెర వేసి సన్నని మంటపై కలుపుతూ మరిగించాలి. పాలు చిక్కగా అయ్యాక ఖర్జూర పేస్ట్, యాలకుల పొడి వేసి మరికాసేపు ఉడికించాలి. చివరిగా ఉడికించిన ఆపిల్ ముక్కలు, డ్రైఫ్రూట్స్ వేసుకుంటే నోరూరించే డేట్స్ ఆపిల్ ఖీర్ సిద్ధం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



వికారాబాద్,(జోర్దార్ ప్రతినిధి):వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాండూరు ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటాల్ ధాన్యానికి రూ. 2,461 మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు.

రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసు కోవాలని,

ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి కుటుంబానికి అండగా రూ.5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా



● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో పథకానికి శ్రీకారం

● హిమ్మత్ నగర్ గ్రామంలో సర్పంచ్ జడల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నమోదు కార్యక్రమం

(వీణవంక జోర్దార్ ప్రతినిధి)తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని హిమ్మత్‌నగర్ గ్రామపంచాయతీలో అమలు చేశారు.హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఓడితెల ప్రణవ్ బాబు నాయకత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జడల శ్రీకాంత్ స్వయంగా లబ్ధిదారుల వివరాల నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మ్యాక శ్రీనివాస్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ అవగాహన కోసం విద్యార్థులకు పోటీలు



● రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైన సింగారం పాఠశాల విద్యార్థి గ్యారంపల్లి శశాంక్

హనుమకొండ జోర్దార్ ప్రతినిధి:భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించుటకు పాఠశాలల్లో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్బులు ఏర్పరిచి పోటీలు నిర్వహిస్తోంది.

ఎన్నికల ప్రక్రియపై సామాజిక అవగాహనను అభివృద్ధి పరచుటకు మరియు ప్రజాస్వామ్య విజయవంతంలో ఓటు యొక్క ప్రాధాన్యతను విస్తృతపరచుటకు పాఠశాల, మండల మరియు నియోజకవర్గస్థాయిలలో విద్యార్థులకు పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీకి ఎంపిక చేశారు. ఈ క్రమంలో నేడు వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా స్థాయి వ్యాసరచన మరియు క్విజ్ పోటీలను నిర్వహించడం జరిగింది. గతంలో వివిధ స్థాయిలలో విజేతలైన విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. నేడు జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ మరియు వ్యాసరచన పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సింగారం, అయినవోలు మండల విద్యార్థి గ్యారంపల్లి శశాంక్ అత్యుత్తమ ప్రతిభను కనబరచి తృతీయ స్థానం పొంది రాష్ట్రస్థాయి ఎలక్ట్రోరల్ కాంపిటీషన్స్ కు ఎంపిక కావడం జరిగింది. ఈ విద్యార్థి వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారద గారి చేతుల మీదుగా మెమొంటో మరియు ప్రశంసా పత్రము స్వీకరించడం జరిగింది.

ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైన విద్యార్థులను హనుమకొండ సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షులు అలిగిరెడ్డి మధుసూదన్ రెడ్డి మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

గాంధీ ఆస్పత్రిలో పసికందు కిడ్నాప్.. లక్షకు విక్రయం, ఆరుగురి అరెస్ట్



హైదరాబాద్, నవంబర్ 21: నగరంలోని సికింద్రాబాద్‌లో గల గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడు రోజుల పసికందు కిడ్నాప్‌కు గురైంది. సమాచారం అందుకున్న పోలీసులు గంటల వ్యవధిలోనే కిడ్నాప్ కేసును ఛేదించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే..పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ బీహార్ మహిళ ఏడు రోజుల క్రితం ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈ పసికందును ఓ ముఠా కిడ్నాప్ చేయగా.. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గంటల వ్యవధిలోనే కేసును ఛేదించి.. ఆరుగురిని అరెస్ట్ చేశారు. పసికందును లక్ష రూపాయలకు ఈ ముఠా విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు.దర్యాప్తులో ఆశ్చర్యకరమైన విషయాలు తెలిసినట్లు పోలీసులు వెల్లడించారు. బీహార్ మహిళకు ఈ పసికందు మూడో కాన్పుగా జన్మించింది. మూడో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టిందని తెలుసుకున్న ముఠా.. మహిళను సంప్రదించారు. ముగ్గురు ఆడపిల్లలుంటే డబ్బులు వస్తాయని నమ్మించారు. అనంతరం పసికందును తీసుకుని పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. కాగా.. సికింద్రాబాద్ డీసీపీ ఆధ్వర్యంలో కేసును ఛేదించినట్లు పోలీసుల బృందం వెల్లడించింది.

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక వెబ్‌సైట్.. త్వరలో ప్రారంభం



హైదరాబాద్, నవంబర్ 21: తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని గుర్తింపు కమిటీ నిర్ణయించింది. ఈరోజు (శనివారం) మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో గుర్తింపు కమిటీ సమావేశమైంది. కమిటీ చైర్మన్ కే. కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. ఇప్పటివరకు చేపట్టిన గుర్తింపు ప్రక్రియపై సమీక్ష జరిపారు. యూనివర్సిటీలు, కళాకారులు, సబ్బండ వర్గాలతో ఇప్పటికే జరిపిన సంప్రదింపులపై చర్చించారు. గుర్తింపు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.ఉద్యమకారుల గుర్తింపు కోసం రూపొందిస్తున్న ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. వెబ్‌సైట్‌ను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కమిటీ నిర్ణయించింది. వెబ్‌సైట్ ప్రారంభ గడువును ఖరారు చేసే అంశంపై సమావేశంలో చర్చించారు. వెబ్‌సైట్ పురోగతిపై సమీక్షించేందుకు కమిటీ త్వరలో మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించింది. వెబ్‌సైట్ ప్రారంభ తేదీతో పాటు.. తదుపరి కార్యాచరణపై త్వరలోనే ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి, శ్యాం మోహన్ పాల్గొన్నారు.

కల్తీ కల్లు తయారీకి మత్తు పదార్థాల సరఫరా.. నిందితుడిపై పీడీ యాక్ట్!



మేడ్చల్, నవంబరు 21: కల్తీ కల్లు తయారీకి వినియోగించే రసాయనాలు, మత్తు పదార్థాల అక్రమ సరఫరాకు పాల్పడుతున్న వ్యక్తిపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సిద్దగొని రంగయ్య (45)పై పీడీ యాక్ట్ అమలు చేశారు. క్లోరల్ హైడ్రేట్, ఆల్ప్రజోలం వంటి మత్తు పదార్థాల అక్రమ సరఫరా కేసుల్లో రంగయ్య కీలక నిందితుడిగా ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు.మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన కేసులో 25 కిలోల క్లోరల్ హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నాచారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ అతడిపై మరో కేసు నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆల్ప్రజోలం సరఫరాకు సంబంధించి కూడా కేసు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పిల్లాయిపల్లి గ్రామంలోని తన స్వగృహం నుంచే రంగయ్య మత్తు పదార్థాల అక్రమ సరఫరా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.వరుసగా మత్తు పదార్థాల అక్రమ సరఫరా కేసుల్లో నిందితుడిగా ఉన్న రంగయ్యపై పీడీ యాక్ట్ అమలు చేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి ఆదేశించారు. దీంతో ఎక్సైజ్ అధికారులు అతడిపై నమోదైన కేసుల వివరాలు.. నేరాలకు సంబంధించిన ఆధారాలతో జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు సమర్పించారు. వాటిని పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ పీడీ యాక్ట్ అమలుకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం రంగయ్య చర్లపల్లి కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉండగా, జైలులోనే అతడికి నిర్బంధ ఉత్తర్వులను అధికారులు అందజేశారు.

జన చైతన్య సభను జయప్రదం చేయాలి : బీఆర్ఎస్ నాయకుల పిలుపు



వరంగల్ : హనుమకొండ కేడీసీ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్‌జన చైతన్య సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొనే సభకు వేలాదిగా ప్రజలు తరలిరావాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు.
శనివారం వరంగల్ జన చైతన్య సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. 2001లో కేసీఆర్ వరంగల్‌లో భారీగా సభను నిర్వహించడం వల్ల ఆ సభ తెలంగాణ ఉద్యమానికి దిక్సూచిగా పనిచేసిందన్నారు. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమానికి నూతన ఉత్తేజాన్ని అందించిన ఇదే ప్రాంగణంలో రేపు బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సభకు మేధావులు, ప్రజలు వేలాదిగా తరలిరానున్నరని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆరూరి రమేశ్, మాజీ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారంపై అధిష్ఠానం సీరియస్.. ఈ నెల 23న కలవాలని ఫోన్

హైదరాబాద్, నవంబర్ 21:తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు భగ్గుమంటున్నాయి. తన నియోజవర్గానికి నిధుల కేటాయింపుల్లో సీఎం రేవంత్ రెడ్డి వివక్ష చూపుతున్నారంటూ మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఆయన బహిరంగంగానే ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు చేయడంతో అధిష్ఠానం స్పందించింది. ఏఐసీసీ కార్యదర్శి ఆయనకు ఫోన్ చేసి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల నూతన ఇంఛార్జ్‌ను కలవాలని ఆదేశించారు. అటు, టీపీసీసీ చీఫ్ కూడా సరైన సమయంలో నిర్ణయం ఉంటుందని అన్నారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయనకు హైకమాండ్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. రాజగోపాల్ రెడ్డికి ఫోన్ చేసిన ఏఐసీసీ కార్యదర్శి.. ఈ నెల 23న కొత్త ఇన్‌ఛార్జ్ బీఎం సందీప్‌తో సమావేశం కావాలని సూచించారు. ఇదిలా ఉండగా, రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువైందని, రాజగోపాల్ రెడ్డి, అనిరుద్ రెడ్డి పై వ్యాఖ్యలను ఏఐసీసీ పరిశీలిన చేయనుందని తెలిపారు.క్రమశిక్షణ చర్యలపై స్పందించి, సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. కొండా సురేఖ విషయంలో మొదటిసారి చర్యలు తీసుకోలేదని, రెండు మూడుసార్లు పరిశీలించిన తర్వాత అధిష్ఠానం చర్యలు తీసుకుందన్నారు.ఇటీవల ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. తన నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన



తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అభివృద్ధి అంటే కేవలం కొడంగల్, మధిర, హుజూర్‌నగర్ నియోజకవర్గాలే కాదని దుయ్యబట్టారు. మునుగోడు అభివృద్ధిని పట్టించుకోవడం లేదని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు.అంతేకాదు, నిధులు ఇవ్వకుంటే మరో కురుక్షేత్రం తప్పదని ఆయన హెచ్చరించారు. ఇదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో రెండేళ్లే పదవిలో ఉంటారని వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాగే, అదృష్టం కొద్దీ దక్కిన అధికారంతో అవినీతికి పాల్పడే పాలకులను తెలంగాణ ప్రజలు, చరిత్ర ఎన్నటికీ క్షమించదని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. సిద్దిపేట సభలో సీఎం రేవంత్ రెడ్డి తనను ఉద్దేశించి పరోక్షంగా చేసిన వ్యాఖ్యలకు ఆయన పై విధంగా కౌంటర్ ఇచ్చారు.ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జిగా నియమితులైన బి.ఎం.సందీప్ ఆదివారం(నవంబరు 22న) హైదరాబాద్‌కు రానున్నారు. గాంధీభవన్‌లో జరగనున్న రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)ల ఉమ్మడి సమావేశంలో ఆయన పాల్గొంటారు. తర్వాత నవంబరు 23న సోమవారం గాంధీభవన్‌లో ఉదయం మంత్రులతో, మధ్యాహ్నం నుంచి డీసీసీ అధ్యక్షులు, పీసీసీ అనుబంధ సమావేశమవుతారు.

వారం రోజుల కిందటే ఉద్యోగం.. ఇంతలోనే విషాదం.. అమెరికాలో జరిగిన ప్రమాదంలో నల్గొండ యువకుడు మృతి

అమెరికా:పై చదువుల కోసం తమ కుమారుడ్ని అమెరికాకు పంపిన తల్లిదండ్రులు.. వారం రోజుల కిందటే ఉద్యోగం సాధించడంతో సంబరపడిపోయారు. తమ బిడ్డ జీవితంలో ప్రయోజకుడయ్యాడని ఎంతో సంతోషించారు. కానీ, వారి సంతోషాన్ని ఆ దేవుడు అంతలో ఆవిరి చేశాడు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కుటుంబం సోక సంద్రంలో మునిగిపోయింది. బుధవారం రాత్రి న్యూయార్క్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్గొండకు చెందిన సాయి తేజ్ మృతిచెందాడు.అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఉన్నత విద్య కోసం వెళ్లిన నల్గొండ జిల్లా మునుగోడుకు చెందిన వీరమళ్ల సాయితేజ (25) చదువు పూర్తికావడంతో ఇటీవలే అక్కడ ఉద్యోగం సాధించాడు. వారం రోజుల కిందటే ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు, ఆనందంలో ఉండగా.. ఇంతలోనే ఊహించని ప్రమాదం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. న్యూయార్క్‌లోని హైవేపై బుధవారం రాత్రి సాయితేజ కారులో ప్రయాణిస్తుండగా.. అకస్మాత్తుగా ఓ జింకు అడ్డుగా వచ్చింది. దీంతో జింకను ఢీకొట్టిన వాహనం రోడ్డుపై నిలిచిపోయింది.అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన సరకు రవాణా వ్యాన్ ఆ కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయితేజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అదే కారులో ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడటంతో అతడ్ని హెలికాప్టర్ ద్వారా పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇక, ప్రమాదానికి కారణమైన వ్యాన్.. మరో రెండు వాహనాలు ఢీకొట్టడంతో మరో ఇద్దరికి స్వల్ప



గాయాలయ్యాయి.మునుగోడుకు చెందిన వీరమళ్ల ప్రసాద్, శ్రీకన్య దంపతుల తమ పెద్ద కుమారుడైన సాయితేజను అమెరికాలో పై చదువులకు పంపారు. అక్కడ ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడతాడని ఆశించిన ఆ తల్లిదండ్రులకు.. అతడి మరణవార్త తీరని శోకాన్ని మిగిల్చింది. అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయితేజ మృతి చెందడంతో మునుగోడులో విషాదఛాయలు అలుముకున్నాయి. తమ కుమారుడి భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు, వారం రోజుల క్రితం కొడుకు ఉద్యోగం సాధించడంతో సంబరపడిపోయారు. కానీ, వారి ఆనందాన్ని చూసి ఆ దేవుడికి అసూయ పుట్టిందేమో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబలించింది. తమ కుమారుడు ఇక లేడన్న వార్త కన్నీటిని మిగిల్చింది. సాయితేజ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. చేతికి అందొచ్చిన కుమారుడు ఇలా దేశం కాని దేశంలో రోడ్డు ప్రమాదంలో విగతజీవిగా తట్టుకోలేకపోతోంది.

సాఫ్ట్‌వేర్ రంగంలో లేఆఫ్స్ సంక్షోభం.. వేలాది ఉద్యోగుల తొలగింపు... ఆందోళనలో కుటుంబాలు!

హైదరాబాద్, నవంబర్ 21:ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ జాబ్ అంటే తెలుగు రాష్ట్రాల్లో ఫుల్ క్రేజ్. పెళ్లి సంబంధం చూడాలంటే ఐటీ ఉద్యోగం చేసే వారికే తొలి ప్రాధాన్యం ఇచ్చేవారు. లక్షల్లో జీతం, చిన్న వయసులోనే సొంత ఇల్లు, కారు లాంటివి పొందడం ఐటీ ఉద్యోగంతో సాధ్యమయ్యేవి. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ఐటీ కలలు కరిగిపోతున్నాయి. ఒకప్పుడు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పించిన సంస్థలు కూడా ఇప్పుడు ఉద్యోగాల్లో కోత పెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగమంటే భరోసా. మంచి జీతం, స్థిరమైన ఆదాయం, సొంత ఇల్లు, పిల్లలకు నాణ్యమైన చదువులు, కుటుంబానికి ఆర్థిక భద్రత... మధ్యతరగతి కుటుంబాల కలలకు సాఫ్ట్‌వేర్ రంగం ఒక మార్గంగా కనిపించేది. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె వంటి నగరాల్లో వేలాది కుటుంబాలు ఈ రంగాన్ని ఆధారంగా చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకున్నాయి. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. చేతిలో మంచి ఉద్యోగం ఉన్నా రేపు ఉంటుందో లేదో తెలియని అనిశ్చితి. ఎప్పుడు తొలగింపు ఉత్తర్వులు వస్తాయోనన్న భయం. ఒకప్పుడు ఉద్యోగులను ఆకర్షించేందుకు పోటీపడిన కంపెనీలే ఇప్పుడు సిబ్బంది సంఖ్యను తగ్గించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. మరోవైపు కొత్త ఉద్యోగులను నియమించుకుంటున్న సంస్థలూ ఉన్నాయి. ఈ రెండు విరుద్ధ పరిణామాలు ఐటీ రంగంలో కొత్త పరిస్థితిని ఆవిష్కరిస్తున్నాయి. క్వాల్‌కామ్, ఇంటెల్, గూగుల్, మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్ వంటి అంతర్జాతీయ దిగ్గజాల నుంచి విప్రో, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్‌టెక్, టెక్ మహీంద్రా వంటి భారతీయ సంస్థల వరకు ఉద్యోగుల విషయంలో పునర్వ్యవస్థీకరణ జరుగుతోంది. ఇది ఒకటి రెండు కంపెనీల సమస్య కాదు. ప్రపంచ సాంకేతిక రంగంలో వస్తున్న నిర్మాణాత్మక మార్పులకు సంకేతం.ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ కోతల పరంపర
ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగ కోతల తీవ్రతను అర్థం చేసుకోవడానికి 2026 నాటి గణాంకాలను పరిశీలించాలి. నవంబర్ 18 నాటికి అందుబాటులో ఉన్న ఒక అంతర్జాతీయ లేఆఫ్ ట్రాకర్ ప్రకారం.. ఈ ఏడాది ఇప్పటివరకు 365 కంపెనీల్లో 1,59,418 మంది ఉద్యోగాలు కోల్పోయారు. 2025లో ఇదే కాలంతో పోలిస్తే ఈ సంఖ్య 36.6 శాతం ఎక్కువ. ఇది ప్రైవేటు సంస్థ సేకరించిన ట్రాకర్



గణాంకం మాత్రమే. ప్రపంచంలోని అన్ని ఉద్యోగ కోతలను కలిపిన అధికారిక ప్రభుత్వ లెక్క కాదు. అయినప్పటికీ సమస్య విస్తృతిని తెలియజేస్తోంది. అమెరికాకు చెందిన క్వాల్‌కామ్ సంస్థలో ఉద్యోగుల తొలగింపుల ప్రక్రియ మొదలైంది. సంస్థ సీఈవో క్రిస్టియానో అమెన్ అక్టోబర్ 20న ఉద్యోగులకు పంపిన అంతర్గత సందేశంలో దీన్ని 'పెర్ఫార్మెన్స్ ఫోకస్డ్ రిడక్షన్స్'గా పేర్కొన్నారు. సంస్థ ప్రాధాన్యాలు, భవిష్యత్తు అవసరాలు, ఉద్యోగుల నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
భారతదేశంలోనూ దీని ప్రభావం కనిపిస్తోంది. మనీ కంట్రోల్ నవంబర్ 11న వెల్లడించిన సమాచారం ప్రకారం.. బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ఉద్యోగుల తొలగింపులు ప్రారంభమయ్యాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్, చెన్నై కేంద్రాలకూ ఈ ప్రక్రియ విస్తరించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా ఉద్యోగులు ప్రభావితమయ్యే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాల అంచనా. అయితే ఈ సంఖ్యను క్వాల్‌కామ్ అధికారికంగా ధ్రువీకరించలేదు.
ఇంటెల్‌లోనూ ఇదే పరిస్థితి. సీఈవో లిప్-బు టాన్ సంస్థను పునర్వ్యవస్థీకరించే చర్యల్లో భాగంగా ఖర్చులు తగ్గించడం, నిర్వహణ స్థాయిలను కుదించడం, ప్రాధాన్యం లేని ప్రాజెక్టుల నుంచి వనరులను మళ్లించడం వంటి చర్యలు చేపడుతున్నారు. నవంబర్ 17, 18 తేదీల్లో మరో విడత ఉద్యోగ కోతల వార్తలు వెలువడ్డాయి. ముఖ్యంగా గ్లోబల్ ఐటీ విభాగంలో ఉద్యోగులు ప్రభావితమైనట్లు సమాచారం. అయితే తాజా విడతలో ఎంతమంది ఉద్యోగాలు కోల్పోయారో కంపెనీ వెల్లడించలేదు. సెప్టెంబర్ చివరికి ఇంటెల్ ఉద్యోగుల సంఖ్య 81,100కు తగ్గింది. 2025 చివరికి ఈ సంఖ్య 85,100గా ఉండేది.

14 ఏళ్ల టెస్ట్ రికార్డు బద్దలు కొట్టిన భారత టాప్-5 బ్యాటర్లు..!



వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మూడో రోజు ఆటలో భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో 486/4 పరుగులు సాధించి 118 పరుగుల కీలక ఆధిక్యం సంపాదించారు. ఈ మ్యాచులో టీమిండియా టాప్ - 5 బ్యాటర్లు అరుదైన రికార్డు సాధించారు. 94 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో విదేశీ గడ్డపై ఒకే ఇన్నింగ్స్‌లో టాప్-5 బ్యాటర్లందరూ (జైస్వాల్ 85, రాహుల్ 136, పడిక్కల్ 80, గిల్ 98, పంత్ 55లి) కనీసం అర్ధశతకం సాధించడం ఇదే తొలిసారి.

వెల్లింగ్టన్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మూడో రోజు ఆటలో భారత బ్యాటర్లు చరిత్ర సృష్టించారు. ఆట ముగిసే సమయానికి భారత్ 4 వికెట్ల నష్టానికి 486 పరుగులు చేసి 118 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఈ ఇన్నింగ్స్‌లో భారత టాప్-5 బ్యాటర్లందరూ 50కి పైగా పరుగులు సాధించడం విశేషం. 94 ఏళ్ల భారత టెస్ట్ చరిత్రలో విదేశీ గడ్డపై ఇలా జరగడం ఇదే మొట్టమొదటిసారి. గతంలో నాలుగుసార్లు భారత టాప్-5 బ్యాటర్లు ఈ ఘనత సాధించినప్పటికీ, అవన్నీ స్వదేశంలోనే నమోదయ్యాయి.న్యూజిలాండ్‌తో మ్యాచులో ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (85), కేఎల్ రాహుల్ (136) శుభారంభం ఇవ్వగా, దేవదత్ పడిక్కల్ (80), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (98), రిషబ్ పంత్ (62 బంతుల్లో 55లి) సత్తాచాటారు.టెస్ట్ ఇన్నింగ్స్‌లో భారత్ టాప్-5 బ్యాటర్లు 50+ స్కోర్లు సాధించిన సందర్భాలు ..కాగా మూడో రోజు ఆట తర్వాత సెంచరీ హీరో కేఎల్ రాహుల్ విలేకరులతో మాట్లాడాడు. తన కెరీర్‌లో ఎదుర్కొన్న క్లిష్ట దశలు, తాజా విజయ రహస్యాలను పంచుకున్నాడు. 290 బంతులు ఎదుర్కొని 136 పరుగులు చేసిన రాహుల్, తన టెస్ట్ కెరీర్‌లో 13వ శతకంతో పాటు నాలుగు ఖండాంతర దేశాలలో (దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) టెస్ట్ సెంచరీలు పూర్తి చేసుకున్న అరుదైన భారత బ్యాటర్ల జాబితాలో చేరాడు.

పాట్ కమ్మిన్స్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా ఫుల్ సపోర్ట్.. సాండ్‌పేపర్ వివాదంపై కీలక ప్రకటన..!



2018 దక్షిణాఫ్రికా పర్యటనలో చోటుచేసుకున్న సాండ్ పేపర్ గేట్ వివాదంపై మళ్లీ వివాదం చెలరేగిన నేపథ్యంలో, టెస్ట్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా బోర్డు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించింది. జోష్ హేజిల్‌వుడ్ చేసిన సంచలన వ్యాఖ్యల అనంతరం సీఏ చైర్మన్ డేవిడ్ బూన్, సీఈఓ టాడ్ గ్రీన్‌బర్గ్ శుక్రవారం సిడ్నీలో కమ్మిన్స్‌తో సమావేశమయ్యారు. 2018 పర్యటనలో పాల్గొన్న ఆటగాళ్లు, సిబ్బంది తమ అనుభవాలను ప్రైవేట్‌గా పంచుకునేందుకు ఏర్పాటు చేసిన స్వతంత్ర ఫోరమ్‌కు హాజరవుతానని కమ్మిన్స్ స్పష్టం చేశాడు.2018 దక్షిణాఫ్రికా పర్యటనలో చోటుచేసుకున్న బాల్ ట్యాంపరింగ్ ఘటనపై మరోసారి చర్చలు రాజుకున్న నేపథ్యంలో, ఆస్ట్రేలియా టెస్ట్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా బోర్డు ఏకగ్రీవంగా అండగా నిలిచింది. జోష్ హేజిల్‌వుడ్ తన భవిష్యత్తుపై చేసిన వ్యాఖ్యల తర్వాత ప్రత్యేకంగా సమావేశమైన బోర్డు, కమ్మిన్స్ నాయకత్వంపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసింది. శుక్రవారం సిడ్నీలో క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మన్ డేవిడ్ బూన్, సీఈఓ టాడ్ గ్రీన్‌బర్గ్ కమ్మిన్స్‌తో భేటీ అయ్యి ప్రస్తుత పరిస్థితులు, త్వరలో జరగనున్న న్యూజిలాండ్ సిరీస్ వంటి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సీఏ చైర్మన్ డేవిడ్ బూన్ మాట్లాడుతూ.. ఈ క్లిష్ట సమయంలో ఓపిక, నిబద్ధతతో ఆస్ట్రేలియా క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ వారం ఏర్పాటు చేసిన స్వతంత్ర ఫోరమ్ ముందు ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్ తమ అభిప్రాయాలను నిర్భయంగా చెప్పాలని సూచించారు. త్వరలోనే టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ప్రచురిస్తామని పేర్కొన్నారు. గత ఎనిమిదేళ్లలో కమ్మిన్స్, ఇతర నాయకులు జట్టులో నెలకొల్పిన సంస్కృతి పట్ల గర్వపడుతున్నామన్నారు. కమ్మిన్స్ నిజాయితీపై ఎలాంటి అనుమానాలు లేవని బూన్ స్పష్టం చేశారు.కెప్టెన్ పాట్ కమ్మిన్స్ మాట్లాడుతూ.. శుక్రవారం డేవిడ్, టాడ్‌లతో మాట్లాడటం ఎంతో విలువైందని తెలిపాడు. ఆస్ట్రేలియా కెప్టెన్‌గా ఉండటం గొప్ప బాధ్యత అని, దానిని ఎప్పటికీ తేలికగా తీసుకోనని చెప్పాడు. 2018 నాటి ఆటగాళ్లు, సిబ్బందితో మాట్లాడిన డేవిడ్, టాడ్‌ల ప్రయత్నాన్ని ప్రశంసించిన కమ్మిన్స్, స్వతంత్ర ఫోరమ్‌కు తాను 100 శాతం మద్దతు ఇస్తానని, తప్పకుండా హాజరవుతానని వెల్లడించాడు.

'అదే జరిగితే రిటైర్మెంట్ ఇస్తా'.. క్రికెట్ ఆస్ట్రేలియాకు జోష్ హేజిల్‌వుడ్ వార్నింగ్..!



2018 సాండ్‌పేపర్ గేట్ వివాదంపై కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ చేసిన తాజా ఆరోపణల నేపథ్యంలో ఆస్ట్రేలియా టెస్ట్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్‌కు సీనియర్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ బహిరంగంగా మద్దతు పలికాడు. బాల్ ట్యాంపరింగ్ విషయం కమ్మిన్స్‌కు ముందే తెలుసన్న ఆరోపణలపై అతడిని టెస్ట్ కెప్టెన్సీ నుంచి తొలగిస్తే, తాను జాతీయ జట్టు నుంచి తప్పుకునే విషయాన్ని పరిశీలిస్తానని 35 ఏళ్ల హేజిల్‌వుడ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు.

డిసెంబర్ 9న పెర్త్ వేదికగా న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్ ప్రారంభం కానున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు ఆస్ట్రేలియా క్రికెట్‌లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.2018 దక్షిణాఫ్రికా పర్యటనలో చోటుచేసుకున్న 'సాండ్‌పేపర్ గేట్' బాల్ ట్యాంపరింగ్ వివాదం ఆస్ట్రేలియా క్రికెట్‌ను మరోసారి కుదిపేస్తోంది. ఉస్మాన్ ఖవాజా, డేవిడ్ వార్నర్, తాజాగా కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ ఆ ఘటన గురించి "జట్టులో అందరికీ తెలుసు" అని సంచలన ఆరోపణలు చేయడంతో, ప్రస్తుత టెస్ట్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అతడిని కెప్టెన్సీ నుంచి తప్పించాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ తరుణంలో ఆసీస్ సీనియర్ ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ కమ్మిన్స్‌కు అండగా నిలుస్తూ సంచలన హెచ్చరిక జారీ చేశాడు.ఒకవేళ ఈ వివాదం కారణంగా పాట్ కమ్మిన్స్‌ను టెస్ట్ కెప్టెన్సీ నుంచి తొలగిస్తే, తాను జాతీయ జట్టుకు ఆడటం మానేసే విషయాన్ని తీవ్రంగా ఆలోచిస్తానని 35 ఏళ్ల హేజిల్‌వుడ్ స్పష్టం చేశాడు! 'కోడ్ స్పోర్ట్స్'తో మాట్లాడుతూ.. బాన్‌క్రాఫ్ట్ 4,000 పదాల ఆర్టికల్ ప్రచురించినప్పటి నుంచి కమ్మిన్స్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శల దాడి జరుగుతోందని మండిపడ్డాడు. "భవిష్యత్తులో సాండ్‌పేపర్ వంటి ఘటనలు మళ్లీ ఎప్పటికీ జరగని స్థాయికి జట్టును కమ్మిన్స్ తీసుకొచ్చాడు. అతడు ఒక గొప్ప నాయకుడు. జట్టులో ఎవరిని అడిగినా ఇదే సమాధానం చెబుతారు" అని హేజిల్‌వుడ్ పేర్కొన్నాడు.

డిసెంబర్ 9న పెర్త్ వేదికగా న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో కమ్మిన్స్ కాకుండా మరొకరు కెప్టెన్‌గా ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందో తనకు అర్థం కావడం లేదని హేజిల్‌వుడ్ అన్నాడు. కమ్మిన్స్‌ను బలవంతంగా తప్పిస్తే, తన కెరీర్‌లో 82వ టెస్ట్ మ్యాచ్ ఆడకపోవడంపై కూడా నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని తెలిపాడు. 2021లో కమ్మిన్స్, స్టార్క్, నాథన్ లైయాన్‌లతో కలిసి తాను సంతకం చేసిన ప్రకటనకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని, మైదానంలోకి సాండ్‌పేపర్ తీసుకెళ్లిన విషయం తమకు తెలియదని హేజిల్‌వుడ్ పునరుద్ఘాటించాడు.2018 కేప్‌టౌన్ టెస్ట్ ముగిసిన వెంటనే జరిగిన రెండు మూడు గంటల సుదీర్ఘ విచారణలో తాను చెప్పిన ప్రతి మాటకు కట్టుబడి ఉన్నానని 313 టెస్ట్ వికెట్ల వీరుడు హేజిల్‌వుడ్ తెలిపాడు. సాండ్‌పేపర్ వాడకం ప్రణాళికలో తాను భాగస్వామిని కాదని, మైదానంలో విదేశీ వస్తువులు వాడుతున్నట్లు తనకు అవగాహన లేదని స్పష్టం చేశాడు. పోర్ట్ ఎలిజబెత్ టెస్ట్ టీ విరామంలో కోచ్ డారెన్ లీమన్, బౌలింగ్ కోచ్ డేవిడ్ సాకర్ సమక్షంలో వార్నర్ ఈ ప్రతిపాదన తెచ్చాడని బాన్‌క్రాఫ్ట్ ఆరోపించిన నేపథ్యంలో, హేజిల్‌వుడ్ వ్యాఖ్యలు ఆసీస్ డ్రెస్సింగ్ రూమ్‌లో వేడిని మరింత పెంచాయి.

ఏకంగా 14 శాతం కుప్పకూలిన ఎన్విడియా షేర్లు.. యాపిల్, మైక్రోసాఫ్ట్, అల్ఫాబెట్ అన్నీ దాటేశాయ్!



ఏఐ స్టాక్స్‌లో భారీగా అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో అమెరికా స్టాక్ ఇండెక్స్‌లు భారీగా కుదేలవుతున్నాయి. నాస్‌డాక్ కాంపోజిట్ ఇండెక్స్ ఒక్క సెషన్‌లో 1200 పాయింట్లకు పైగా (5 శాతానికిపైగా) నష్టపోయింది. ఇతర సూచీలు డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్, ఎస్ అండ్ పీ 500 సూచీలు కూడా భారీగా తగ్గి కరెక్షన్ మోడ్‌లోకి ప్రవేశించాయి. ఇక్కడ మైక్రాన్, బ్రాడ్‌కామ్, ఎన్విడియా సహా పలు స్టాక్స్ భారీగా కుదేలయ్యాయి. ఇక్కడ మనం ఎన్విడియా స్టాక్ గురించి మాట్లాడుకుందాం. తాజాగా నవంబర్ 20 (శుక్రవారం) సెషన్‌లో ఏకంగా 14 శాతానికి మించి కుదేలైంది. కిందటి సెషన్‌లో 145.98 డాలర్ల వద్ద స్టాక్ ధర ముగియగా స్వల్ప నష్టంతో ప్రారంభమై చివరకు 14.01 శాతం నష్టంతో 125.53 డాలర్ల వద్ద సెషన్ ముగించింది. ఇంట్రాడేలో 124.50 డాలర్ల వద్ద సరికొత్త 52 వారాల కనిష్ఠ స్థాయిని తాకింది.

ఎన్విడియా స్టాక్ భారీ పతనంతో ఇన్వెస్టర్ల సంపద భారీగా తగ్గింది. ప్రస్తుతం కంపెనీ మార్కెట్ విలువ 3.03 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర 243.37 డాలర్లుగా ఉండగా, కనిష్ఠ ధర 124.50 డాలర్లుగా ఉంది. ఇక్కడ గరిష్ఠ స్థాయి నుంచి ఈ స్టాక్ ఏకంగా 50 శాతం వరకు కుదేలైంది. గత 5 రోజుల్లో 21 శాతానికిపైగా పడిపోగా, నెల రోజుల్లో 44 అప్పుడు గ్రాము బంగారం రూ.4,540కే కొన్నారు.. ఇప్పుడు రూ.13,345.. ప్రకటనతో చేతికి రూ.2.93 లక్షలు!

ఇన్వెస్టర్ల కొంప ముంచుతోన్న 'బంగారం, వెండి'.. ఒక్కరోజే భారీగా పడిన . ముందుగా ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ వివాహేతర సంబంధాలు బయటపడ్డప్పటి నుంచి ఈ స్టాక్ కుదేలవుతూ వచ్చింది. తొలుత చైనా గూఢచారిగా భావిస్తున్న అలిస్ హువాంగ్‌తో వ్యవహారం బయటపడటం, దీనిని హువాంగ్ ఒప్పుకోవడం జరిగాయి. ఆ తర్వాత కంపెనీకి చెందిన మరో ఉద్యోగితోనూ అఫైర్ వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో సంస్థ సీఈఓ పదవి నుంచి ఆయనను తప్పించింది. దీంతో స్టాక్ కుదేలవుతూనే ఉంది. ఇటీవల క్యూ3 ఫలితాలు కూడా మెప్పించలేకఎోయాయి.ఇప్పుడు శుక్రవారం సెషన్‌లో యూఎస్ స్టాక్ మార్కెట్లు భారీగా పతనం కావడం, ఇదే సమయంలో ఎన్విడియా అకౌంటింగ్ విధానాలపై అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ విచారణ జరుపుతుందన్న రిపోర్ట్స్ బయటికి రావడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. మాజీ సీఈఓ జెన్సన్ హువాంగ్‌కు చైనా గూఢచారిగా అనుమానిస్తున్న మహిళతో సంబంధాల వల్ల అధునాతన చిప్స్ లేదా రహస్య సమాచారం చైనాకు చేరిందా అన్న అంశంపై కాలిఫోర్నియా అటార్నీ జనరల్ నవంబర్ 19న సమన్లు జారీ చేశారు. ఇది కూడా షేర్లపై ఒత్తిడిని పెంచింది. =ముఽ ూశ్రీంశీ: భారతదేశ చరిత్రలోనే తొలిసారి ఇలా.. ఒక్క నెలలోనే రూ. 1 లక్ష కోట్ల పెట్టుబడులు.. విదేశీ ఇన్వెస్టర్ల అండ!ఈ నేపథ్యంలోనే కొద్ది రోజులుగా ఎన్విడియా స్టాక్ భారీ పతనంతో మార్కెట్ విలువ పడిపోవడం.

ధోనీ రిటైర్మెంట్ నిర్ణయం నన్ను ఆశ్చర్యపరిచింది: జహీర్ ఖాన్



ఐపీఎల్ ఆటగాడిగా టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ శకం ముగిసింది. ఇటీవలే క్రికెటర్‌గా ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఐదు సార్లు టైటిల్స్ గెలవడంలో ధోనీ కీలక పాత్ర పోషించాడు. మరో సీజన్‌లో కూడా ప్రేక్షకులను అలరిస్తాడని భావిస్తున్న తరుణంలో వీడ్కోలు చెబుతూ అందరినీ విస్మయానికి గురి చేశాడు. మాజీ క్రికెటర్లు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ధోనీ నిర్ణయంపై తాజాగా చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ జహీర్ ఖాన్ స్పందించాడు. ధోనీ రిటైర్మెంట్ నిర్ణయం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని తెలిపాడు.సీఎస్కే యూట్యూబ్ ఛానల్‌లో జహీర్ ఖాన్ మాట్లాడుతూ.. 'ఐపీఎల్ 2027 సీజన్ ఈ సైకిల్‌లో చివరిది కావడంతో ధోనీ ఆట నుంచి తప్పుకుంటారని నేను ఊహించలేదు. నా మనసులో ఆ ఆలోచనే లేదు. కానీ ఎంఎస్.. ఏం చేయాలి, ఎప్పుడు చేయాలనేది కచ్చితంగా తెలుసుకుని నిర్ణయం తీసుకుంటారు. ఎటువంటి హంగామా లేకుండా చాలా సహజంగా, సున్నితంగా తన నిర్ణయాన్ని చెప్పారు' అని జహీర్ పేర్కొన్నాడు.'ప్రతి ఏటా ధోని మైదానంలో ఆడుతూ కనిపిస్తారని ఆశిస్తాం. ఈసారి మాత్రం క్రికెటర్‌గా కాకుండా మెంటర్‌గా కొత్త అవతారంలో కనిపించనున్నారు. అందుకే ధోని నిర్ణయం విషయంలో నాకు మిశ్రమ భావోద్వేగాలు ఉన్నాయి. మెంటర్‌గా నా భారాన్ని పంచుకుంటూ, సరైన దిశలో మార్గనిర్దేశం చేస్తారన్న ఆనందం ఒకవైపు.. అతడు తీసుకున్న నిర్ణయం పట్ల భావోద్వేగం మరోవైపు ఉన్నాయి. అలానే సీఎస్కే బాధ్యతల విషయంలో సిద్ధమవుతోంది.

సెంచరీకి 2 పరుగుల దూరంలో గిల్ ఔట్.. భారత్‌కు 118 పరుగుల ఆధిక్యం!



న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత బ్యాటర్లు భారీ స్కోరు సాధించారు. ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులు చేయగా.. భారత్ 486/4 స్కోరుతో 118 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. సెంచరీకి చేరువైన శుభ్‌మన్ గిల్ అనూహ్యంగా 98 పరుగుల వద్ద బౌల్డ్ కావడంతో నిరాశగా పెవిలియన్ చేరాడు. మరోవైపు రిషభ్ పంత్ అర్ధసెంచరీతో క్రీజులో నిలిచాడు.గిల్-పంత్ జోడీ న్యూజిలాండ్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించింది. గిల్ 146 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 98 పరుగులు చేశాడు. సెంచరీకి రెండు పరుగుల దూరంలో ఉండగా జాకబ్ డఫీ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. లోపలికి దూసుకొచ్చిన బంతి గిల్ బ్యాట్, ప్యాడ్‌ను తాకుతూ ఆఫ్‌స్టంప్‌ను పడగొట్టింది. దీంతో అతడి సెంచరీ ఆశలు ఆవిరయ్యాయి.ఇక రిషభ్ పంత్ దూకుడుగా ఆడుతూ 61 బంతుల్లో 54 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో బౌండరీలు, దూకుడైన షాట్లు ఆకట్టుకున్నాయి. పంత్ తన టెస్టు కెరీర్‌లో 22వ అర్ధసెంచరీ నమోదు చేశాడు. గిల్, పంత్ కలిసి కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత్‌ను ఆధిక్యంలోకి తీసుకెళ్లారు.

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులు చేయగా.. భారత బ్యాటర్లు ఆ స్కోరును అధిగమించి ప్రత్యర్థిపై ఆధిక్యం సాధించారు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో భారత్ మరింత భారీ ఆధిక్యం సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మళ్లీ తగ్గిన బంగారం ధరలు.. ఈ రోజు ఎలా ఉన్నాయంటే..



బంగారం ధరలు క్రమంగా తగ్గుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో విలువైన లోహాల ధరలు పడిపోతున్నాయి. ఇప్పటికే భారీగా దిగి వచ్చిన బంగారం ధరలు ఈ రోజు (శనివారం) కూడా తగ్గాయి. దేశీయ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.490 తగ్గగా.. 22 క్యారెట్ల బంగారంపై రూ.450 మేర ధర తగ్గింది. దీంతో కొనుగోలుదారులకు భారీ ఊరట లభించినట్లయింది గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.490 తగ్గి రూ.1,25,080కు చేరింది అలాగే ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.450 తగ్గి రూ.1,14,650 వద్దకు దిగివచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.1.75 లక్షలు ఉంది.

కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించిన భారత్.. రాహుల్ సెంచరీ, గిల్ 98 ఔట్..!



మూడో రోజు ఆటలో కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్ తొలి సెషన్‌లో వికెట్ కోల్పోకుండా 80 పరుగులు జోడించారు. రెండో సెషన్ ఆరంభంలోనే జాకబ్ డఫీ బౌలింగ్‌లో సింగిల్ తీసి రాహుల్ తన 13వ టెస్ట్ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మరోవైపు పడిక్కల్ కూడా అద్భుతంగా ఆడి 80 పరుగులు సాధించగా, రెండో వికెట్‌కు వీరిద్దరూ 150కి పైగా పరుగులు జోడించారు. కొత్త బంతితో కైల్ జేమీసన్ అద్భుత బంతితో పడిక్కల్‌ను బౌల్డ్ చేసి ఈ జోడీని విడదీశాడు.

అనంతరం క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సెంచరీ వీరుడు కేఎల్ రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను వేగంగా ముందుకు నడిపించాడు. టీ విరామం తర్వాత గిల్ సిక్సర్‌తో అర్ధశతకం పూర్తి చేయడంతో భారత్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 91 పరుగులు జోడించిన తర్వాత, నాథన్ స్మిత్ బౌలింగ్‌లో రాహుల్ (136) అవుటయ్యాడు.చివరి సెషన్‌లో శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్ జోడీ కివీస్ బౌలర్లపై విరుచుకుపడింది. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన పంత్, ఆ తర్వాత జాకబ్ డఫీ ఒకే ఓవర్లో రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాది గేర్ మార్చాడు. 55 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న పంత్, గిల్‌తో కలిసి శతక భాగస్వామ్యం నెలకొల్పాడు. మూడో రోజు ఆఖరి సెషన్‌లో భారత్ 32 ఓవర్లలోనే 142 పరుగులు రాబట్టింది. 28 ఓవర్లలో 179 పరుగులు ఇచ్చి విఫలమైన డఫీ, రోజు చివరి ఓవర్లో శుభ్‌మన్ గిల్‌ను (98) బౌల్డ్ చేశాడు. దీంతో కేవలం 2 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్న గిల్ నిరాశగా పెవిలియన్ చేరాడు.మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 486/4 వద్ద నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో అయింది.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అనితీత అంతం - మా పంతం

నార్త్ అమెరికాలో విశ్వక్ సేన్ క్రేజీ గ్యాంగ్ ర్యాంపేజ్.. 'ఈఎన్ఈ రిపీట్' 2 రోజుల కలెక్షన్స్ ఎంతంటే?

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం వెంకటేష్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఈఎన్ఈ రిపీట్'. నవంబర్ 19న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. తొలిరోజే రూ.15 కోట్లకు పైగా రాబట్టి మొదటి పార్ట్ లైఫ్ టైమ్ కలెక్షన్స్‌ను అధిగమించింది. నార్త్ అమెరికాలో 800k డాలర్లు దాటి 1 మిలియన్ మార్క్ దిశగా దూసుకెళ్తోంది. రెండు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా ఎన్ని కోట్ల గ్రాస్ సాధించిందంటే...నార్త్ అమెరికాలో క్రేజీ గ్యాంగ్ ర్యాంపేజ్.. 'ఈఎన్ఈ రిపీట్' రెండు రోజుల కలెక్షన్స్ ఎంతంటే?

తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో వచ్చిన లేటెస్ట్ మూవీ 'ఈఎన్ఈ రిపీట్'. 2018లో కల్ట్ యూత్ ఫుల్ మూవీగా నిలిచిన 'ఈ నగరానికి ఏమైంది' సినిమాకు సీక్వెల్ ఇది. ఇందులో విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి ప్రధాన పాత్రలు పోషించారు. నవంబర్ 19న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజైన ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. కలెక్షన్స్ కూడా బాగానే వచ్చాయి. రెండు రోజుల వసూళ్ల వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

'ఈఎన్ఈ రిపీట్' మూవీ మొదటి రోజు రూ.15 కోట్లకి పైగా గ్రాస్ ని రాబట్టి, 'ఈ నగరానికి ఏమైంది' లైఫ్ టైం వసూళ్లని కేవలం ఒక్క రోజు లోనే క్రాస్ చేసింది. రెండు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 23.12 కోట్ల కలెక్షన్స్ సాధించినట్లు మేకర్స్ వెల్లడించారు. నార్త్ అమెరికాలోనే 800k డాలర్లకు పైగా రాబట్టి, 1 మిలియన్ డాలర్ మార్క్ దిశగా పయనిస్తోందని తెలిపారు. అన్ని ఏరియాలో రెండో రోజు కంటే మూడో



రోజు ఫుట్ ఫాల్స్ ఎక్కువ ఉన్నట్లు పేర్కొన్నారు. పబ్లిక్ డిమాండ్ మేరకు అదనపు షోలు కూడా యాడ్ చేస్తున్నారు.ఈ వారం 'ఈఎన్ఈ రిపీట్' మూవీతో పాటుగా దుల్కర్ సల్మాన్ 'ఆకాశంలో ఒక తార', ధనుష్ - మమ్ముట్టి 'ఓం' వంటి క్రేజీ చిత్రాలు థియేటర్లలోకి వచ్చాయి. బాక్సాఫీస్ దగ్గర గట్టి పోటీ ఉన్నప్పటికీ, 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ ఇంత మంచి నంబర్స్ నమోదు చేయడం విశేషం. అడ్వాన్స్ బుకింగ్స్ ట్రెండ్ చూస్తుంటే, ఆదివారం కూడా భారీ కలెక్షన్స్ వస్తాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

సమంతకు మగబిడ్డ.. 12 ఏళ్ల క్రితమే యాంకర్ ప్రదీప్ షోలో జోస్యం..

నటి సమంత రూత్ ప్రభు, దర్శకుడు రాజ్ నిడిమోరు దంపతులు నవంబర్ 19న పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. పుట్టిన వెంటనే బాబుకు 'దేవ్ నిడిమోరు' అని పేరు కూడా పెట్టారు. ఈ నేపథ్యంలో 12 ఏళ్ల కిందట యాంకర్ ప్రదీప్ నిర్వహించిన టాక్ షో వీడియో వైరల్ అవుతోంది. అందులో ఓ జ్యోతిష్యుడు సమంతకు తొలి సంతానంగా కొడుకు పుడతాడని జోస్యం చెప్పారు. 12 ఏళ్ల క్రితం చెప్పిన జోస్యం నిజమైందని అభిమానులు పాత వీడియోని నెట్టింట షేర్ చేస్తున్నారు.

సౌత్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. నవంబర్ 19న తనకు కుమారుడు పుట్టినట్లు ఆమె సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. బాబుకు 'దేవ్ నిడిమోరు' అనే పేరు పెట్టినట్లు తెలిపారు. అయితే సామ్ కు మొదట కొడుకే పుడతాడని 12 ఏళ్ల క్రితమే జోస్యం చెప్పబడింది. దీనికి సంబంధించిన



వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.యాంకర్ ప్రదీప్ మాచిరాజు గతంలో 'కొంచం టచ్ లో ఉంటే చెప్తా' అనే సెలబ్రిటీ టాక్ షో హోస్ట్ చేశారు. దీనికి సమంత గెస్టుగా హాజరయ్యారు. ఇందులో భాగంగా ఓ జ్యోతిష్యుడ్ని పిలిపించి సామ్ కు జాతకం చెప్పించారు. సమంత సంతాన రేఖను బట్టి ఆమెకు ఇద్దరు పిల్లలు కలుగుతారని, తొలి సంతానంగా కొడుకు పుడతారని చెబుతారు. 2014లో ఆ జ్యోతిష్యుడు చెప్పినట్టుగానే సామ్ కు మగబిడ్డ జన్మించడంతో, ఆ పాత వీడియో క్లిప్పింగ్ ని ఇప్పుడు వైరల్ చేస్తున్నారు.

అక్కినేని నాగ చైతన్యతో విడిపోయిన తర్వాత, 2025 డిసెంబర్ 1న దర్శకుడు రాజ్ నిడిమోరును సమంత పెళ్లి చేసుకున్నారు. ఏడాది తిరక్కుండానే పండంటి మగబిడ్డకు స్వాగతం పలికారు. 'మా ఇంటి బంగారం' మూవీ సెట్స్ పై ఉన్నప్పుడు గర్భం దాల్చిన సామ్.. సినిమా రిలీజైన తర్వాత ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. బేబీ బంప్ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ వచ్చారు. సీమంతం విశేషాలను పంచుకున్నారు. 9 నెలల గర్భిణీగా వర్క్ అవుట్ చేసిన వీడియోలను పోస్ట్ చేశారు. డెలివరీకి రెండు రోజుల క్రితం కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజ నిర్వహించినట్లు తెలిపారు.

'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాకు ఏడాది.. దర్శక నిర్మాత వేణు ఊడుగుల ఎమోషనల్!

తెలుగు సినీ చరిత్రలో వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కి, ప్రేక్షకుల గుండెలను బరువెక్కించిన అద్భుతమైన గ్రామీణ ప్రేమకావ్యం 'రాజు వెడ్స్ రాంబాయి' విడుదలై నేటితో (నవంబర్ 21) సరిగ్గా ఏడాది పూర్తి చేసుకుంది. అయితే ఈ మైలురాయిని పురస్కరించుకుని, ఈ చిత్రానికి సమర్పకుడిగా, నిర్మాతగా వ్యవహరించిన ప్రముఖ దర్శకుడు వేణు ఊడుగుల సోషల్ మీడియా వేదికగా ఎమెషనల్ అయ్యాడు.సాధారణంగా ఏ సినిమాకైనా తెరపై కనిపించే ఒక కథ ఉంటుందని, కానీ చాలా అరుదుగా కొన్ని చిత్రాలకు మాత్రమే తెరవెనుక కూడా అంతకుమించిన మరో కథ ఉంటుందని వేణు ఊడుగుల అభిప్రాయపడ్డారు. తన జీవితంలో 'రాజు వెడ్స్ రాంబాయి' అలాంటి ఒక ప్రత్యేకమైన అనుభూతి అని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా ఏడాది క్రితం థియేటర్లలో అడుగుపెట్టిన ఈ చిత్రం తనకు జీవితాంతం గుర్తుండిపోయే ఎన్నో అనుభవాలను, మధురమైన జ్ఞాపకాలను అందించిందని ఆయన ఎమోషనల్



అయ్యారు. ఈ అద్భుతమైన ప్రయాణం సాధ్యం కావడానికి ప్రధాన కారణమైన ఈటీవీ విన్‌సంస్థకు, అలాగే ఈ సినిమా కోసం అహర్నిశలు శ్రమించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు, చిత్రబృందంలోని ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా ప్రేమతో కృతజ్ఞతలు తెలియజేశారు.దర్శకుడు సాయిలు కంపాటి తన తొలి ప్రయత్నంలోనే అత్యంత సహజంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దిన విధానం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. 2010 నాటి వరంగల్-ఖమ్మం సరిహద్దు ప్రాంతాల్లోని ఒక మారుమూల పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ హృదయ విదారక ప్రేమకథలో అఖిల్ రాజ్ ఉద్దెమరి, తేజస్వి రావు, చైతు జొన్నలగడ్డ తమ అద్భుత నటనతో పాత్రలకు ప్రాణం పోశారు. గతేడాది నవంబర్ 21న బన్నీ వాస్ వర్క్స్, వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థల ద్వారా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించడమే కాకుండా, 2025 ఏడాదికి గాను ప్రతిష్టాత్మక 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లో ఉత్తమ చిత్రంగా (దీవర్ ఖీమ్‌ఖతీవ ఖీఅశ్రీఎ) నిలిచి చరిత్ర సృష్టించింది. థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమైన అనంతరం ఈటీవీ విన్ ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అవుతూ డిజిటల్ ప్రేక్షకుల నుండి కూడా విశేష ఆదరణను సొంతం చేసుకుంది.

తెలుగు ప్రేక్షకుల ముందుకు 'ఫూలే'.. నవంబర్ 27న గ్రాండ్ రిలీజ్!



సామాజిక సంస్కరణల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయులు జ్యోతిరావ్ ఫూలే, సావిత్రిబాయి ఫూలే జీవిత పోరాటం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ఫూలే'. సమాజంలో నెలకొన్న కులవివక్ష, అసమానతలు, మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఫూలే దంపతుల స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించారు. ప్రముఖ దర్శకుడు అనంత్ మహదేవన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సుపదా క్రియేషన్స్ బ్యానర్‌పై డా. పొన్నం రవిచంద్ర నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తెలుగు డబ్బింగ్ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది.తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా వీక్షించింది. ఇక సినిమా వీక్షించిన అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కులవివక్ష నిర్మూలన, మహిళా విద్య కోసం ఫూలే దంపతులు చేసిన పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వారి సామాజిక సేవ, జీవిత ఆశయాలు నేటి సమాజానికి అత్యంత అవసరమైన సందేశాన్ని అందిస్తాయని అభిప్రాయపడ్డారు. 'ఫూలే' కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, సమాజంలో మార్పు కోసం పోరాడిన ఇద్దరు మహనీయుల జీవితాలను, వారు ఎదుర్కొన్న అడ్డంకులను కళ్లకు కట్టే ఒక చారిత్రాత్మక కథనమని చిత్ర బృందం పేర్కొంది.

గోగులు గోగులు గోపాలకృష్ణుడు సేలి'.. ఆకట్టుకుంటున్న 'ఇడుపుకాయితం' పెళ్లి సాంగ్



విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పించే ప్రియదర్శి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇడుపు కాయితం'. జానపద పాటలతో గుర్తింపు పొందిన నాగదుర్గ ఈ చిత్రంలో కథానాయికగా కనిపించనున్నారు. యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి తెరకెక్కిస్తున్న ఈ ఎంటర్‌టైనింగ్ ఫ్యామిలీ డ్రామాను బన్నీవాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బన్నీవాస్, తబిత సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా చిత్రబృందం తాజాగా 'గోగులు గోగులు..' అనే లిరికల్ పాటను విడుదల చేసింది.శ్రీనివాస్ పాత్రలో ప్రియదర్శి, శ్రీలత పాత్రలో నాగదుర్గల పెళ్లి వేడుక నేపథ్యంలో ఈ పాటను రూపొందించారు. సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి ఆకట్టుకునే బాణీ సమకూర్చగా, కొంగరి కృష్ణ సాహిత్యం అందించారు. అభిక్య తనికెళ్ల, తరుణి, రచిత రాయప్రోలు, జయశ్రీ పల్లెం, స్నిగ్ధ శర్మ కలిసి ఈ గీతాన్ని ఆలపించారు. 'గోగులు గోగులు గోపాలకృష్ణుడు సేలి, గోగులు గోగులు గోపాలకృష్ణుడు సేలి, గోగులు గోగులు గోపాలకృష్ణుడు ఆనంద బాలుడు నందకుమారుడు, రమ్మనరే రమ్మనరే నలుగుకు నా ముద్దు గోపాలకృష్ణున్ని, రమ్మనరే నలుగుకు నా ముద్దు గోపాల కృష్ణుని...' అంటూ సాగే ఈ పాట వేడుక వాతావరణాన్ని చక్కగా ప్రతిబింబిస్తోంది.

ఈ చిత్రంలో ప్రియదర్శి, నాగదుర్గలతో పాటు శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), సుజాత (జోర్దార్), చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాంకేతిక విభాగంలో ఎంఎన్ బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ, శ్రీధర్ సొంపల్లి ఎడిటింగ్, ఆశిష్ తేజ ఆర్ట్ డైరెక్షన్, అశ్వత్ నిర్వహిస్తున్నారు.

శేఖర్ మాస్టర్, రాహుల్ సిప్లిగంజ్ చేతుల మీదుగా 'నువ్వు రమ్మంటే' ఫోక్ సాంగ్ విడుదల!

ఆయాతి క్రియేషన్స్ పతాకంపై ధీ అభి, నైనిక అనసురు, 'రాను బొంబాయికి రాను' ఫేమ్ లిఖిత ప్రధాన పాత్రల్లో నటించిన పాట 'నువ్వు రమ్మంటే'. ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించడం విశేషం. సంధ్యా శ్రీధర్ కంతేటి నిర్మించిన ఈ పాటకు కుమార్. జి. దర్శకత్వం వహించగా, కల్యాణ్ కీస్ సంగీతం సమకూర్చారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ పాట విడుదల వేదుకకు ప్రముఖ కొరియోగ్రాఫర్లు శేఖర్ మాస్టర్, భాను మాస్టర్, గాయకులు రాహుల్ సిప్లిగంజ్, రామ్ రాథోడ్ ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు.ఈ కార్యక్రమంలో గాయకుడు రామ్ రాథోడ్ మాట్లాడుతూ.. ఈ పాట లాంఛ్‌కు అతిథిగా ఆహ్వానించడం సంతోషంగా ఉందని, గణేష్ మాస్టర్, శేఖర్ మాస్టర్, భాను మాస్టర్‌లతో వేదిక పంచుకోవడం గర్వంగా ఉందని తెలిపారు. రాహుల్ సిప్లిగంజ్ స్ఫూర్తితోనే తాను ఫోక్ సాంగ్స్ చేయడం మొదలుపెట్టానని, ఈ పాట పెద్ద హిట్ కావాలని ఆకాంక్షించారు. నిర్మాత సంధ్యా శ్రీధర్ కంతేటి మాట్లాడుతూ.. తాను పవన్ కల్యాణ్ అభిమానినని, ఆయన సినిమాల్లోని ఫోక్ సాంగ్స్ అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. అలాంటి పాట చేయాలనుకున్నప్పుడు బ్యానర్ పెట్టడం, ప్రొడక్షన్ విషయాలపై తనకు అవగాహన లేకపోయినా, గణేష్ మాస్టర్, లిఖిత సహకారంతో అన్నీ చక్కగా కుదిరాయని, ఈ పాట తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.నటి లిఖిత మాట్లాడుతూ.. 'నువ్వు రమ్మంటే' పాటలో నటించే అవకాశం రావడం ఆనందంగా ఉందని, గణేష్ మాస్టర్ కొరియోగ్రఫీ



చేస్తున్నారని తెలిసిన వెంటనే అంగీకరించానని, ప్రేక్షకులు ఈ పాటను ఆదరించాలని కోరారు. హీరో ధీ అభి మాట్లాడుతూ.. తనకు ఇది మొదటి ఫోక్ సాంగ్ అని, తన అభిమాన కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్, రాహుల్ సిప్లిగంజ్ అతిథులుగా రావడం సంతోషంగా ఉందన్నారు. ఎంతోమంది స్టార్ హీరోలకు కొరియోగ్రఫీ చేసిన గణేష్ మాస్టర్ తన పాటకు కొరియోగ్రాఫ్ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని, ఈ పాట అందరికీ తప్పకుండా నచ్చుతుందని చెప్పారు.

గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇండిపెండెంట్ మ్యూజిక్‌కు మంచి ఆదరణ లభిస్తోందని, ఈ పాట చాలా బాగుందని, కల్యాణ్ కీస్ చక్కని సంగీతం అందించారని ప్రశంసించారు. పాట కాన్సెప్ట్ క్రెడిట్ గణేష్ మాస్టర్‌కే దక్కుతుందని, ఈ పాట బృందంలోని అందరికీ మంచి పేరు తీసుకురావాలని కోరుకున్నారు. భాను మాస్టర్ మాట్లాడుతూ.. తన గురువు గణేష్ మాస్టర్ తనను అతిథిగా పిలవడం సంతోషంగా ఉందని, భాకాంక్షలు తెలిపారు.

కూతురితో సరదాగా .. ఎమోషనల్ పోస్ట్ షేర్ చేసిన అల్లు అర్జున్!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన సినిమాలతోనే కాకుండా కుటుంబానికి సంబంధించిన మధురమైన క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. ముఖ్యంగా తన పిల్లలతో కలిసి గడిపే సమయానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులను ఆనందపరుస్తుంటారు. తాజాగా తన గారాల పట్టి అల్లు అర్హా పుట్టినరోజు సందర్భంగా అల్లు అర్జున్ చేసిన ఓ ప్రత్యేక పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నేడు అల్లు అర్హా పుట్టినరోజు కావడంతో బన్నీ తన కుమార్తెకు ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అల్లు అర్హాతో కలిసి ఉన్న ఓ అందమైన ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. ఈ ఫొటోకు అదిరిపోయే క్యాప్షన్ కూడా జోడించారు.నా జీవితంలోని ఆనందానికి పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ హ్యాష్‌ట్యాగ్‌తో తన ప్రేమను వ్యక్తం చేశారు. తండ్రిగా తన కుమార్తెపై ఉన్న ప్రేమను ఈ చిన్న మాటల్లో ఎంతో అందంగా తెలియజేశారు. ఈ పోస్ట్ షేర్ చేసిన కొద్ది సమయంలోనే అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఇప్పటికే ఈ ఫొటోకు 3 లక్షలకు పైగా లైక్స్ వచ్చాయి. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు అల్లు అర్హాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

అల్లు అర్జున్‌కు సంబంధించిన ఈ ఫ్యామిలీ పోస్ట్ అభిమానులను



ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. తెరపై స్టైలిష్ స్టార్‌గా, మాస్ హీరోగా కనిపించే బన్నీ.. వ్యక్తిగత జీవితంలో తన పిల్లలతో ఎంతో ప్రేమగా ఉండే తండ్రిగా కనిపించడం అభిమానులకు ఆనందాన్ని కలిగిస్తోంది. ఇక అల్లు అర్జున్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ఫాంటసీ యాక్షన్ చిత్రం 'రాకా'లో నటిస్తున్నారు. ఈ సినిమాలో దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తోంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో పాటు దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో కూడా అల్లు అర్జున్ ఓ సినిమా చేయాల్సి ఉంది. ఇలా వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న బన్నీ.. మరోవైపు కుటుంబానికి కూడా తగినం ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

అనిరుధ్ - కావ్య వెడ్డింగ్ రిసెప్షన్.. సన్ గ్రూప్ ఉద్యోగులకు గిఫ్టుగా గోల్డ్ రింగ్స్



అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్యా మారన్ ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టగా, నేడు (నవంబర్ 21) చెన్నైలో వీరి రిసెప్షన్ జరగనుంది. ఈ సందర్భంగా కావ్య తమ సన్ గ్రూప్ ఉద్యోగులకు బంగారు ఉంగరాలు, గోల్డ్ కాయిన్స్, చాక్లెట్లతో కూడిన గిఫ్ట్ బాక్సులను పెళ్లి కానుకగా అందించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనికి సంబంధించిన ఇన్విటేషన్ కార్డులో కావ్య పేరు అని ముద్రించడం గమనార్హం.స్టార్ మ్యూజిక్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్యా మారన్ ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఈరోజు (నవంబర్ 21) చెన్నైలో వీరి వెడ్డింగ్ రిసెప్షన్ జరగనుంది. ఈ వేడుకకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. మరోవైపు కావ్యా తన పెళ్లి సందర్భంగా తమ కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు ఖరీదైన బహుమతులు ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి.సన్ గ్రూప్ ఎంప్లాయీస్ కి బంగారు ఉంగరాలు, గోల్డ్ కాయిన్స్ కావ్య మారన్ పెళ్లి కానుకగా అందించినట్లు సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్నాయి. అందులో ఉద్యోగులు స్పెషల్ గిఫ్ట్ బాక్సులు అందుకున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అనిరుధ్ - కావ్య వెడ్డింగ్ కార్డుతో పాటు చాక్లెట్లు, గోల్డ్ రింగ్ కూడా ఉన్నాయి. తమకు బంగారు నాణేలు ఇస్తారని భావించామని, కానీ బంగారు ఉంగరం ఇవ్వడంతో ఆశ్చర్యపోయామని ఓ ఉద్యోగి వీడియోలో పేర్కొన్నారు.

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224